بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపుటి 1

సంచిక 34

వార్షిక చందా 300/-రూ॥

వార పత్రిక బదర్ ఖాదియాన్

The Weekly BADAR Qadian TELUGU

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

www.akhbarbadrqadian.in

25 మొహర్రం 1438 హి.ఖ, 27 ఇఖా 1395, హి.శ, 27 అక్టోబర్ 2016

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మొమినీన్ అయ్యదహు తాలా బినస్రిహిల్ అజీజ్ అల్లాహ్ తాలా దయతో క్షేమంగానే యున్నారు. అల్‌హందులిల్లాహ్.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ ఆయురారోగ్యము, ఉన్నత ఆశయాల సాధన, ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు కొనసాగించ గలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచు సహాయ, సహకారాము అందించుగాక! (ఆమీన్)

**దైవ సాంప్రదాయమే మనగా, ప్రథమముగా అతడు తన సందేశహరుల, అవతారపురుషుల నామమును ప్రపంచములో ఒక భాగము వరకు వ్యాపించునంత వరకు, అతని ప్రకటణ ప్రజల వరకు చేరునంత వరకు నిశ్శబ్దముగా నుండును. ఆ తరువాత తన ఆకాశ నిదర్శనాలతో, విజ్ఞాన, వివేకాధారాల అనుసారంగా ప్రజలపై తన ఘనతను చాటుకొనును.....దైవాదేశాను సారం సందేశహరుల కీర్తి ప్రతిష్టలను కీర్తింపజేయును. పైగా దైవదూతలు కూడ భుమిపైకి వచ్చి మీరు అనుసరిస్తున్న మార్గము సరైనది కాదనే ఆలోచనలను పావనీయుల హృదయాలలో కల్గజేయడం వలన వారు సన్మార్గంను గూర్చి అన్వేషణను ప్రారంభించెదరు. (ఉపదేశములు : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)**

7వ ప్రశ్న: సందేశము అందించడమనగా అర్ధమేమిటి?

సమాధానం: సందేశము అందించుటకు రెండు విషయములు అనివార్యము. ఒకటి, దైవం నుండి అవతరించబడిన వ్యక్తి, నన్ను దైవం అవతరింప జేసినాడని ప్రజలలో ప్రకటించుకోవాలి. వారి అభిమతాలలో ఉన్న తప్పిదాలను గుర్తించి మీరు ఆయా విషయాలలో తప్పుడు నడక నడస్తున్నారని హెచ్చరించాలి. లేక ఆయా కార్యనిర్వాహణలో మీరు చాలా నిర్లక్ష్యము వహిస్తున్నారని వారికి సర్దిచెప్పాలి. రెండవ విషయము ఏమిటనగా దైవ నిదర్శనములను ప్రదర్శింపజేస్తు విజ్ఞాన, వివేక పరమైన ఆధారలతో తన సత్యమును నిరూపించుకోవాలి. ఇందుకు గల దైవ సాంప్రదాయమే మనగా, ప్రథమముగా అతడు తన సందేశహరుల, అవతారపురుషుల నామమును ప్రపంచములో ఒక భాగము వరకు వ్యాపించునంత వరకు, అతని ప్రకటణ ప్రజల వరకు చేరునంత వరకు నిశ్శబ్దముగా నుండును. ఆ తరువాత తన ఆకాశ నిదర్శనాలతో, విజ్ఞాన, వివేకాధారాల అనుసారంగా ప్రజలపై తన ఘనతను చాటుకొనును. అంతేగాకా ప్రపంచములో ఎనలేని విధముగా తన అద్భుత హస్తములతో వారి(అ) గౌరవమును కీర్తింపజేయును. ఈ విధముగా తేజోవంతమైన నిదార్శనాలతో ఇతరులపై వారి (అ) ఘనతను కీర్తింపజేయుట అతనికి అసాధ్యమైన పనియేమి కాదు. ఏ విధముగానైతే ఆకాశంలో ఒక వైపున మెరసిన మెరపు ఎంతో తర్వగా మరో వైపునకు చేరుకోని మెరుస్తుండడంను మనము చూస్తామో, అదే విధముగా దైవాదేశాను సారం అంత కన్న అధిక వేగంతో సందేశహరుల కీర్తి ప్రతిష్టలను కీర్తింపజేయును. పైగా దైవదూతలు కూడ భుమిపైకి వచ్చి మీరు అనుసరిస్తున్న మార్గము సరైనది కాదనే ఆలోచనలను పావనీయుల హృదయాలలో కల్గజేయడం వలన వారు సన్మార్గంను గూర్చి అన్వేషణను ప్రారంభించెదరు. అప్పుడు అల్లాహ్ తాలా వారి కాలపు అవతారుని సందేశం వారి వరకు చేరవేయు విధానాలను ఏర్పాటు చేయును. ప్రత్యేకించి నేటి కాలంలో ఒక పేరు మోసిన దొంగను గూర్చి కొన్ని రోజులలోనే ప్రపంచమంతట హెచ్చరిస్తున్నప్పుడు, ఎల్లప్పుడు తన దాసునికి తోడుగా ఉంటున్న దైవం ఈ ప్రపంచములో తన దాసునికి పేరు ప్రఖ్యాతలు సాధించకుండా, గోప్యముగానే ఉంచునా?. దేవుడు అతని ప్రఖ్యాతను ప్రకటింపజేయుటలో అసమర్థుడిగా నిలుచునా?. ✿నా సత్య నిదర్శనము కోసం మరియు మన మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ధర్మవ్యాప్తి కోసం గతంలో ఎన్నడు ప్రదర్శించనన్ని నిదర్శనములను అల్లాహ్ తాలా తన అనుగ్రహముతో ప్రదర్శించడమును నేను తిలకిస్తున్నాను. అందుకే నా కాలంలో రైలు, టెలిగ్రాం, తంతి తపాల, సముద్ర నౌకలు, విమానంలు ఇతర ప్రయాణ సాధనాల వలన ప్రపంచములోని అనేక దేశాల ప్రజలు ఒకే దేశ వాసులుగా, ఒకే పట్టణ వాస్తవ్యులుగా జీవనం కొనసాగిస్తున్నారు. ఒకవేళ ఒక వ్యక్తి పర్యటించ దల్చినచో కేవలం కొన్ని రోజులలోనే ప్రపంచ మంతయు చుట్టి రాగలడు. అంతేగాకా పుస్తకాల రచన కూడ ఎంత సులభతర మైనదనగా నాడు ఒక పుస్తకము కొన్ని వందల సంఖ్యలో ప్రచురించవలసి వచ్చినచో కొన్ని వందల సంవత్సారాలు పట్టేది, కాని నేడు ఎంతో నూతనమైన ముద్రణాలయాల ఆవిష్కరణల వలన ఆయా పుస్తకాలను కేవలం ఒకటి రెండు సంవత్సారాలలోనే కొన్ని లక్షలుగా ప్రచురించి, దేశమంతట అందుబాటులోకి తీసుకరావచ్చును. అంతేగాకా గత వంద సంవత్సరాల క్రితం మన దేశ ప్రజలు ఆలోచించడానికి కూడ వీలులేనన్ని ఎన్నో సులభతరమైన ప్రచార మార్గాలు నేడు ఆవిష్కరణలోకి వచ్చాయి. నేటి నుండి కేవలం ఒక 50 సంవత్సారాల పూర్వ స్థితినే గమనించినచో ప్రజలలో అనేకులు అవగాహన లేమి వలన మూర్ఖత్వంలో ఉన్నట్లు మనకు ఆధారాలు లభించును. కాని నేడు అందుకు భిన్నంగా గ్రామాలలో సైతం పాఠశాలలను నెలకొల్పడం వలన వారికి లభించిన విజ్ఞానంతో ధార్మిక గ్రంధాలను కూడ చాలా సునాయాసంగా అర్థం చేసుకోగల్గుతున్నారు. నేడు నా అవతరణను గూర్చిన సందేశము ప్రజలకు తెలియజేయుటకై నేనే స్వయంగా పంజాబ్ రాష్ట్రానికి చెందిన ముఖ్య పట్టణాలలో ఉదా॥ అమృతసర్, లాహోర్, జలందర్, సయాల్కోట్, లుధియానాతో పాటు దేశ రాజధాని డిల్లిలో కూడ పెద్ద ఎత్తున సమావేశాలను నిర్వహిస్తు ఆ దైవ సందేశమును అందిస్తున్నాను. అంతేగాకా వేల సంఖ్యలో ఏకం చేసిన ప్రజల ముందు ఇస్లాం బోధనలను వినిపిస్తున్నాను. అంతేగాకా ఇస్లాం వాస్తవికతను అరబి, ఉర్దు, ఫారశి, ఆంగ్ల భాషలలో సుమారు 70కి పైగా పుస్తకాల రూపంలో రచించి, లక్షల సంఖ్యలో ప్రచురించి మన దేశంతో పాటు ఇస్లామియ దేశాలలో పంపిణి చేయడమైనది. ఈ కార్యసిద్ధి కొరకే కొన్ని లక్షల ప్రకటనలను నేను ప్రచురించడం జరిగినది. ఫలితంగా అల్లాహ్ తాలా కృపానుసారం, అతని మార్గ దర్శనం వలన నేటికి మూడు లక్షలకు పైగా జనులు ప్రాయశ్చిత్తం చేసుకొంటు నా హస్తముపై బైఅత్ చేసినారు. ఈ కార్యము ఎంత వేగమును పుంజుకొంటున్నదనగా ప్రతి నేల కొన్ని వందల మంది నా హస్తమున బైఅత్ చేస్తున్నారు. ఈ జమఅత్‌ను గూర్చి సందేశము పరదేశీయుల వరకు కూడ చేరినది. ఒక విధముగా చెప్పదల్చినచో నా అవతరణను గూర్చిన విషయం ఖండాంతర వాసులైన అమెరికా, యూరప్ వారికి కూడ చేరినది. అమెరికాలోని అనేకులు ఈ జమాఅత్‌లో చేరినారు. అంతేగాకా అసాధారణ భూకంపాలను గూర్చిన భవిష్యవాణులు కూడ నా సత్య నిదర్శనమునకే సాక్ష్యంగా నిల్చినట్లు ఆయా దేశ పత్రికలలో ప్రచురించారు. యూరప్ ప్రజలు కూడ జమాఅత్‌ను స్వీకరించారు. ఇస్లామియా దేశ ప్రజల గూర్చి చెప్పవలసిన దేమనగా నేను ముందే తెల్పినట్లు నేటి వరకు సుమారు మూడు లక్షలకు పైబడిన ప్రజలు జమాఅత్‌ను స్వీకరించడం జరిగినది. వారిలోని సత్పుర్షులు, పావనీయులు వేల నిదర్శనాలను తిలకించి వాటికి సాక్షులుగా నిలిచారు.

---

✿ గత 25 సంవత్సారాల క్రితమే నా గూర్చి అల్లాహ్ తాలా చేసిన భవిష్యవాణిని బరాహీనే అహ్మదియ్యాలో పేర్కొనడం జరిగినది. నా తండ్రి గారికి మరియు వారి అతి సమీప సన్నిహితులకు కాకుండా మరెవరికి తెలియని సమయంలో అల్లాహ్ తాలా నా గూర్చి " **అంత మిన్ని బి మన్‌జిలతి తౌహీది వ తఫ్‌రీది ఫ హాన అన్ తుహాన ఫతుష్‌హారఫ బైనన్నాసి**" అనే ఈ భవిష్యవాణి చేయడమైనది. అనగా నీవు నా ఏకత్వ, ఏకేశ్వరోపాసానికి మార్గదర్శకుడివి. నీకు అన్ని విధాలుగా సహకరించే సమయం ఆసన్నమైనది. నీవు ప్రపంచమంతయు ప్రసిద్ధి గాంచెదవు. ప్రసిద్ధి చెందుటను ఏకత్వ, ఏకేశ్వరోపాసనంతో ముడిపెట్టుటలో గల ఆంతర్యము కేవలం అల్లాహ్ తాలాయే మహత్త్వ పూర్వకంగా, వైభవోపేతంగా సుత్తింపబడుటకు అసలు అర్హుడని నిఖ్ఖచ్చితంగా తెలుపడం. ఎవరిపై ప్రత్యేక దైవ అనుగ్రహము ఉండునో వారు తమ భక్తి ప్రపూర్ణల వలన దైవ ఏకేశ్వరోపాసనంనకు తాత్కాలిక ప్రతినిధిగా నిల్చును. తద్వారా అతనిలో గల ఇతర ప్రభావములన్నియు మాటు మాయమగును. అప్పుడు అల్లాహ్ తాలా ఏవిధముగా తన కీర్తి ప్రతిష్టలతో ప్రసిద్ధిగాంచునో, అదే విధముగా తన దాసునికి కూడ కీర్తి ప్రతిష్టలను ప్రసాదించును. ఎందుకనగా ఏకత్వ, ఏకేశ్వరోపాసనం ఈ రెండింటి స్వభావం గౌరవ ప్రదమైన స్థాయిని కల్పించుటయే.

( రూహాని ఖజాయిన్ సంపుటి 22, హఖీ ఖతుల్ వహి పుట 169-172)

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

## సంపాదకీయం: -

ధర్మము అనగా నేమి? మన అల్లాహ్ చిట్టచివరి ఆశయం ఏమిటి? ఏ మార్గముల ద్వారా, ఏ విధానాల ద్వారా ఆ ఆశయాలను సాదించు కోగలము. అనే విషయాల గూర్చి పరిజ్ఞానము లేనివారు కొందరు కేవలం సంస్థలను స్థాపించడం, పాఠశాలలను నెలకొల్పడమే ధార్మిక అభివృద్ధికి తోడ్పడుతుంటాయని అంటుంటారు. అందులకే మనోవాంఛలను అంతము చేస్తూ, ముక్తిని ప్రసాదించు సెలయేరు వరకు చేరవేయుటకు అనువైన సత్సంబంధాన్ని, నిజాయితి, నమ్మకముతో, అల్లాహ్‌తో ఏర్పరచుకోవడమే ఈ జీవితపు (ధర్మపు) అసలైన ముఖ్యోద్దేశమని వారు గ్రహించాలి. కేవలం మానవుల అలంకరణ, ప్రయత్నముల వలన విశ్వాసపూరితమైన ఆ ద్వారములు తెరువబడవు. అంతేగాక మానవుడు సిద్ధించుకున్న తత్త్వము కూడ ఈ క్రమములో ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చలేదు. అందులకే అంధకార సమయంలో తన ప్రత్యేకమైన దాసుల ద్వారా అల్లాహ్ తాలా ఆ కాంతిని నిరంతరము ఆకాశము నుండి అవతరింప చేస్తుంటాడు. వాస్తవమునకు ఎవరైతే దైవము నుండి అవతరించబడుతారో వారే దైవముతో సత్సంబంధాన్ని నెలకొల్పుతారు. కావున సందేహాస్పదములో చిక్కుకొని, మనోవాంచలకు బానిసలై అంధాకార కూపంలో నక్కిన ఓ జనులారా! కేవలం ఇస్లాం నామము, ఇస్లాం ఆచారములపై గర్వించకుము. నేటి కాలంలో మీ స్వేచ్ఛాయుతమైన సౌఖ్యము, మీ వర్తమాన సంక్షేమము మరియు మీ జీవిత ఆశయము మీరు కొనసాగిస్తున్న ఈ సంస్థల స్థాపనలలో, పాఠశాలల ఆవిష్కరణల లో లేవని గ్రహించండి. ఈ ప్రయత్నముల వలన ఆరంభములో లాభము చేకూర్చినను, ప్రగతికి ప్రథమ సోపానమైనట్లు కన్పించినను, ఆశయ సాధనకు చాలా దూరంలో నున్నవి. అయినప్పటికి ఈ ప్రయత్నముల వలన మీ మేథస్సులో చురుకుతనం పెరుగవచ్చును. శరీరంలో ఉత్సాహం కలుగచ్చును, పదునైన ఆలోచనలు పరుగెత్తవచ్చును. మరియు పసలేని సంభాషణలకు అలవాటు పడవచ్చును. లేదా పండితుడు, విద్యావంతుడు అని బిరుదు పొందవచ్చును. అంతేగాకా చాలా కాలం విద్యను అభ్యసించడం వలన కొంత మేరకు ఆశయ సాధనలో సహాయకుడు కావచ్చును. కాని ఏ విధముగానైతే సామెత చెప్పుకున్నట్లు ఇరాక్ నుండి ఔషధము తెచ్చేవరకు రోగి మరణించినట్లుగా స్థితి యుండును. అందుకే మేల్కొనుము. వివేకము ప్రదర్శింపుము, తడబడకుము, భక్తిహీనత అవిశ్వాసముతో మీరు పరలోకమునకు ప్రయాణించకుము. అల్లాహ్ తప్పించు గాకా! నామ మాత్రపు విద్యాభ్యాసములపైన పరలోక సౌఖ్యములు అసాధ్యమని ఖచ్చితముగా విశ్వసించండి. అంతేగాకా సందేహాస్పదమైన మలినాలను శుభ్రపరుచుటకు ఆకాశ కాంతి తప్పక వెల్గొందవలెను. తద్వారా అత్యాశను చల్లార్చి, అల్లాహ్ యొక్క స్వచ్ఛమైన ప్రేమానురాగాలను, సత్యమైన విధేయత వైపునకు గైకొని పోవును. ఒక వేళ నిన్ను నీవు ప్రశ్నించుకున్నట్లయితే ఒక్క క్షణంలోనే ఆధ్యాత్మిక మార్పుకు కారణమగు నిజమైన సంతృప్తి, నిజమైన ప్రశాంతత, నేటి వరకు మీరు పొందలేదనే సమాధానం మీకు లభించును. అన్నింటిని మించిన విచారకరమైన విషయం ఏమిటంటే మీరు అనవసరపు విషయాలను, పరిపూర్ణము గాని విద్యను వ్యాపింపజేయుటకు ఎంత శ్రద్ధను కనబర్చుతున్నారో అందులో కనీసం పదవ వంతైన దైవ పరంపర విద్య వైపు కనబర్చలేదు. మొదటగా మీరు చేయుచున్న పనులు అధర్మానికి సంభందించినవి. ఒక వేళ ధర్మసమ్మితమైనవే అయినచో అవి కూడ చాలా సాధారణమైనవి. మరియు నిజమైన ఆశయానికి చాలా దూరంలో నున్న పనుల కొరకు మీ జీవితమును వెచ్చించుచుంటిరి. మీలో జ్ఞానం, వివేకం ఉన్నచో అవి మీ లక్ష్య సాధనకు తోడ్పడుచున్నచో మీరు లక్ష్యము సాధించువరకు విశ్రాంతి గొనకుము. ఓ జనలారా! మీరు మీ స్వచ్ఛమైన దైవాన్ని, మీ అసలైన సృష్టి కర్తను, మీ నిజమైన ఆరాధకున్ని గుర్తించి, అతనినే ప్రేమించుచు, అతనికి విధేయులై యుండుట కొరకే సృష్టించబడ్డారు. అందువలన ఎప్పటివరకైతే మీ సృష్టి ముఖ్యోద్దేశమును మీలో పరిపూర్ణముగా అంతర్లీనము చేసుకొని ప్రదర్శింపజూపరో, అప్పటి వరకు మీరు మీముక్తి మార్గమునకు చాలా దూరంలో యున్నట్లు గ్రహించండి. ఒకవేళ మీరు ఆత్మవిమర్శన చేసుకున్నట్లయితే అనుక్షణం అల్లాహ్ ఆరాధనకు బదులు మీ హృదయంలో గల ఒక బహురూపి ప్రపంచ విగ్రహం ముందు ప్రతిక్షణం వెయ్యి సాష్టాంగములు చేయుచున్నారని. అంతేగాకా మిమ్ములను మీరు ప్రపంచ సాధనలోనే మరో వైపు దృష్టి మరల్చలేనంతగా మీ సమయం నంతయు కేంద్రీకరించుకొన్నారని, చివరికి ఈ పర్యావసానపు అంతము ఎలా ఉండుననే అవగాహన కూడ లేకుండిరని. మీ అంతర్గత జీవితముకు మీరే సాక్షులగుదురు. మీలో న్యాయబద్ధత ఎక్కడుంది?. మీలో మాట కొల్పుతనం ఎక్కడుంది? పవిత్ర ఖుర్‌ఆన్ ఆహ్వానించుచున్న ఆ సరళత్వము, ఆ నిజాయితి, ఆ దైవభీతి, ఆ వినయములు మీలో ఎక్కడున్నాయి? మనకంటు ఒక దైవం ఉన్నాడని కనీసం పొరపాటున కూడ మీకు గుర్తుకు రాడు కదా! కనీసం అతనికై నెరవేర్చవలసిన బాధ్యతలు మనపై ఏమి ఉన్నాయి అనే ఆలోచన కూడ మీ మదిలో ఒక్కసారి కూడ కలుగదు కదా! సత్యమేమిటంటే ఆ సత్యస్వరూపుడితో ఏ అనుబంధాన్ని, ఎటువంటి సంబంధాన్ని, ఏ సాన్నిహిత్యాన్ని కొనసాగించలేదు. అందులకే కనీసం అతని నామస్మరణం చేయుట కూడ మీకు కష్టతరమగుచున్నది. మీలో విశ్వాసపు సుగుణాలు లేవని అతడు మీకు తెలియజేసినప్పటికినీ, అల్లాహ్ సృష్టి ధర్మము మిమ్ములను సిగ్గుపడునట్లు చేసినప్పటికిని, మీరు అలా ఏమియు లేదంటూ, అతి తెలివిని ప్రదర్శించుచు, వితండ వాదములు చేయుచున్నారు. ఒక వేళ మీ ప్రాపంచిక సాధన చింతనలో, ఆలోచనలలో అత్యధిక తెలివితేటలను వినియోగించుచు, గాంభీర్యమును ప్రధర్శించినప్పటికిని మీ సామర్ధ్యము, మీ సూక్ష్మజ్ఞానము, మీ దూరదృష్టి, కేవలం ప్రపంచ అంచుల వరకే వ్యాపించి ఉండును. అంతేగాకా మీ ఆత్మలను సృష్టించి, వాటి చిరకాలపు నిలయం కొరకు ఏర్పాటు చేయబడిన ఆ పరలోకపు ఒక మూలను కూడ మీ తెలివి తేటల ద్వారా కనుగొనలేరు. ఏ విధముగానైతే ఒక వ్యక్తి చిరకాలము నిల్చు సామాగ్రిపై సంతృప్తిగా ఉండునో, అదే విధముగా మీరు కూడ ప్రాపంచిక జీవితమును గూర్చి అంతే సంతృప్తిగా ఉన్నారు. ఎల్లకాలములందు సత్యసంతృప్తిని కల్గించే ఆ పరలోక ఆనందములు మీకు మీ జీవితములో ఒక్కసారైన కుడా గుర్తుకు రావు కదా! ఎంతటి దురదృష్టము! అత్యంత ఘనతగల ప్రత్యేక విషయమును గూర్చి తెలుసుకొనుటలోనే మీరు పూర్తి అలసత్వంలో కన్నులు మూసుకొని యుండి ఈ విషయమును వదిలివేసితిరి. కాని వదిలి వేయవలసిన విషయంలో మాత్రం రేయింబవళ్ళు పరుగులు తీయుచుంటిరి. ఒక్క క్షణంలోనే మీ జీవితము, మీకోరికలన్నింటిని పరిసమాప్తం చేయు సమయం తప్పక వచ్చునని తెలిసి, అవగాహన కల్గియు, ప్రపంచ సాధనకే మీ సమయమునంతయు కేటాయిస్తుండడం ఎంతటి విచిత్రం! దౌర్భాగ్యం! ఆ ప్రపంచ సాధన కూడ శాస్త్రీయముగా కాకుండ అశాస్త్రీయ పద్ధతులలో అబద్ధము, మోసము, మెదలైన వాటి నుండి మొదల్కొని హత్యల వరకును మీరు వాటిని శాస్త్రీయమైనవిగా (హలాలుగా) మల్చుకొంటిరి. అదియే కాక మీలో అంతర్లీనమైన, ఈ సిగ్గుమాలిన నేరాల వలన దైవకాంతిని మరియు దైవ పరంపరల అవసరమే లేదని వాటిపై శతృత్వమును పెంచుకొని ప్రగల్భాలు పలుకుచుంటిరి. మీరు దైవ పరంపరను సాధరణమైనదిగా, తేలికైనదిగా పరిగణించు చుంటిరి. ఆ దైవ పరంపరను గూర్చి సంభాషించుటలో మీ నాలుకలు అయిష్టతతో, చాలా అహంకారముతో, చీదరించు కొంటు, దూషణలు పలుకుచుండెను. అదియే కాక ఈ పరంపర అల్లాహ్ నుండి లభించినదని వేము ఎలా విశ్వసించవలెనని పదే పదే మీరు ప్రశ్నించుచుంటిరి. అందుకు సమాధానం ఏమనగా ఒక వృక్షము దాని ఫలములతో గుర్తించబడును. కావున నేను నా ఈ సందేశమును మీకు తెలియపరిచితిని. దీనిని స్వీకరించుట, తిరస్కరించుట, పదిలపర్చుకొనుట లేదా మరచిపోవుట అన్నియు మీ ఆధీనములోనే యున్నవి.

(రూహాని ఖజాయిన్ సంపుటి-3, ఫతహ్ ఇస్లాం పుట; 41-44)

❁ ❁ ❁ ❁ ❁

**122 వ వార్షిక సభ ఖాదియాన్ (ప్రారంభించి 125 సంవత్సరములు)**

**26, 27, 28 డిశంబర్ 2016 తేదీలలో జరుగును. ఇన్షాఅల్లాహ్**

125 వ వార్షిక సభ ఖాదియాన్ కొరకు 26, 27, 28 డిశంబర్ 2016 సోమవారము, మంగళవారము, బుధవారములను సయ్యద్నా హజ్రత్ అమీరుల్ ముమినీన్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఆమోదించిరి. కనుక ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ శుభకరమైన సభలో పాల్గొనుటకు సంకల్పించి దుఆలతో సన్నాహాలు మొదలుపెట్టగలరు. ఈ దైవ సభతో సంపూర్ణ రీతిలో ప్రయోజనము పొందు అనుగ్రహము అల్లాహ్ తఆలా మనందరికి కల్పించుగాక! ఈ సభ శుభప్రదము, విజయవంతమగుటకు సత్య స్వభావికులు మార్గదర్శనము పొందుటకు కారణమగుటకు ప్రార్థనలు కొనసాగించగలరు. జజాకుముల్లాహ్.

*(నాజిర్ ఇస్లాహ్ వ ఇర్షాద్ మర్కజియ్య ఖాదియాన్)*

## జుమా ప్రసంగము

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాలహు అలైహి వసల్లం ఒక సందర్భమున విశ్వాసి లక్షణాలను తెల్పుచూ తన కొరకు ఇష్టపడు వస్తువునే తన సోదరుని కొరకు, మిత్రుల కొరకు ఇష్టపడు వాడే స్వచ్ఛమైన విశ్వాసియని తెల్పిరి. ఇదొక ఆదర్శవంతమైన సూత్రము. ఇది ప్రపంచములోని అన్ని స్థాయిలలో అనగా గృహము నుండి అంతర్జాతీయ స్థాయి వరకు ఆప్యాయత, సంధికి పునాది వేయును. వివాదములను అంతమొందించి మనసులో మృదుత్వము పుట్టించును. ఇతరుల హక్కులను చెల్లించుట వైపు ఆసక్తి కల్గించును.

నేను ఈ విషయమును వివిధ సందర్భాలలో ఇతరుల ముందు ప్రస్తావించగా వారు ప్రభావితులైతారు. కాని కేవలం నాలుగు మంచి మాటలు చెప్పి ఇతరులను ప్రభావితుల్ని చేయడమే మన లక్ష్యము కాదు. తమ ఆచరణతో అన్ని విషయాలలో ఇస్లామియ ఆదేశము యొక్క సుందరతను నిరూపించవలెను. మీరు ప్రస్తావించిన విషయము మంచిదే అని మేము ఒప్పుకొంటున్నాము, కాని మీలో ఎందరు ఈ ఆదేశాలను ఆచరిస్తున్నారు, అవకాశం లభించినప్పుడు స్వార్ధంమును చూపరా? అని ఇతరులు మనలను ప్రశ్నించవచ్చు. ఒక వ్యక్తి తాను చెప్పే విషయమును ఆచరించి చూపినప్పుడే ఆ విషయ ప్రాధాన్యత బహిర్గతమగును.

ఏ విధముగానైతే మనము మన హక్కుల సాధన కొరకు ఆందోళన చెందుతామో ఇతరుల హక్కులను నెరవేర్చుట కొరకు కూడ అంతే ఆందోళనకు గురి కావాలి. మననుండి పొరపాటు జరిగినప్పుడు మన పొరపాటుకు మన్నింపును కోరుకున్నప్పుడు, శిక్ష పడకూడదని ఆశించుకున్నప్పుడు ఇతరుల నుండి తప్పిదములు సంభవించినప్పుడు కూడ, అవి కావాలని చేయనప్పుడు, అతడు పదే పదే ఆ తప్పు చేయనప్పుడు అతనిని క్షమించే స్వభావం మనలో కూడ కలగాలి. ఒకవేళ అతని తప్పిదము సమాజం మొత్తానికి లేదా దేశానికి కలంకమునకు కారణమవుచున్నచో ఆ తప్పిదము అతని వ్యక్తిగత తప్పిదముగా భావించబడదు. అప్పుడు అతడు దేశ దోషిగా భావించబడును.

"చట్టా శిక్షాస్మృతి ప్రకారం ప్రతి చెడుకు అందుకు సమానమైన చెడును కల్గించుటయే శిక్ష. కాని ఒక వ్యక్తి ఆ దోషిని క్షమించడం వలన అతనిలో మార్పు సంభవించునని గ్రహించినచో, ఒకవేళ క్షమించినచో అతడు తప్పులు చేయుటలో మిక్కిలి సహసం చూపువానిగా, భయంకరుడిగా మారడని భావించినచో అతనిని క్షమించుటయే ఉత్తమము, అట్టి వ్యక్తి అల్లాహ్ తాలా నుండి అతి ఉత్తమమైన బహుమానంను పొందును".

అల్లాహ్ తాలా మనందరికి ఈ ప్రమాణికమును అనుసరిస్తు జీవనమును సాగించు భాగ్యమును నొసంగును గాకా! (ఆమీన్)

**సయ్యిద్నా అమీరుల్ మొమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 23 సెప్టెంబర్ 2016 ( 23 తభూక్ 1395 హి.షు) తేదీన లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాలహు అలైహి వసల్లం ఒక సందర్భమున విశ్వాసి లక్షణాలను తెల్పుచూ తన కొరకు ఇష్టపడు వస్తువునే తన సోదరుని కొరకు, మిత్రుల కొరకు ఇష్టపడు వాడే స్వచ్ఛమైన విశ్వాసియని తెల్పిరి. ( సునన్ ఇబ్నే మాజా కితాబు జహద్ బాబ్ అల్ వరహు వ త్తక్వ హదీస్ 4217) ఇదొక ఆదర్శవంతమైన సూత్రము. ఇది ప్రపంచములోని అన్ని స్థాయిలలో అనగా గృహము నుండి అంతర్జాతీయ స్థాయి వరకు ఆప్యాయత, సంధికి పునాది వేయును. వివాదములను అంతమొందించి మనసులో మృదుత్వము పుట్టించును. ఇతరుల హక్కులను చెల్లించుట వైపు ఆసక్తి కల్గించును.

నేను ఈ విషయమును వివిధ సందర్భాలలో ఇతరుల ముందు ప్రస్తావించగా వారు ప్రభావితులైతారు. కాని కేవలం నాలుగు మంచి మాటలు చెప్పి ఇతరులను ప్రభావితుల్ని చేయడమే మన లక్ష్యము కాదు. తమ ఆచరణతో అన్ని విషయాలలో ఇస్లామియ ఆదేశము యొక్క సుందరతను నిరూపించవలెను. మీరు ప్రస్తావించిన విషయము మంచిదే అని మేము ఒప్పుకొంటున్నాము, కాని మీలో ఎందరు ఈ ఆదేశాలను ఆచరిస్తున్నారు, అవకాశం లభించినప్పుడు స్వార్ధంమును చూపరా? అని ఇతరులు మనలను ప్రశ్నించవచ్చు. ఒక వ్యక్తి తాను చెప్పే విషయమును ఆచరించి చూపినప్పుడే ఆ విషయ ప్రాధాన్యత బహిర్గతమగును. మన మాటలు, మన చేతలు రెండు ఒకే విధముగా ఉన్నప్పుడే మన విశిష్టతలు ప్రజలకు తెలియును. ప్రజలు కేవలం వినుటకే పరిమితమైపోరు, మన నడవడికను కూడ నిశితంగా పరిశీలించెదరు. జర్మని మస్జిద్ ప్రారంభోత్సవ సమయంలో ఆ ప్రాంతపు జిల్లా కమీషనర్ గారు మీరు మహిళలతో కరాచలనం చేయకుండా తప్పుచేస్తున్నారని అభ్యంతరమును వ్యక్తపర్చినప్పుడు నేను వారికి వివరణతో సమాధానంను ఇచ్చాను. అందుకు మరో వ్యక్తి "మీ ఖలీఫా తెల్పినట్లు ఇతరులకు గాని , ఆయా దేశాలకు గాని నష్టము చేకూరనప్పుడు తన ధర్మము తెల్పినట్లు, తమ కట్టుబాట్లు సూచించినట్లు ఆచరించడం ప్రతి ఒక్కరికి స్వాతంత్ర హక్కు ఉన్న విషయము వాస్తవమే, కాని దాని వాస్తవికత అహ్మదీయ యువతీ యువకులందరు ఆచరించి చూపినప్పుడు, లేదా అధికులు ఆ ఆదేశమును ఆచరిస్తున్నారా? లేదా? అని చూసినప్పుడు మాత్రమే బహిర్గతమవుతుందని తన అభిప్రాయాన్ని వెల్లడించిన విషయమును నేను జర్మని పర్యటనలో భాగాంగ అచట ఇచ్చిన చివరి ప్రసంగములో బహుశా మీ ముందు ప్రస్తావించాను కూడ.

కావున గుర్తుంచుకోవలసిన విషయము ఏమిటనగా మనము ధర్మము పేరున గొప్ప ప్రవర్తనల గురించి ఇతరుల ముందు ప్రస్తావించినప్పుడు, మన ఆచరణలు అందుకు తగినట్లుగా ఉన్నాయా? లేవా? అని ఇతరులు మనలను పరిశీలించెదరు. మీలో గొప్ప ప్రవర్తనలు ఉన్నప్పుడు, ఒకరి పట్ల మరొకరి మనోభావాలు, ఉద్వేగముల ప్రమాణం ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే మీరు నిజమైన విశ్వాసులని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం విశ్వాసుని ఉన్నత ప్రవర్తనల గూర్చి తెల్పిన విషయాలను ఎవరు తిరస్కరించలేరు. వారు తెల్పిన ఆ ప్రమాణికం ఏమిటి? ఆ ప్రమాణికం "ఏ వస్తువును నీవు నీ శ్రేయస్సు కొరకు ఇష్టపడుదువో ఇతరుల కొరకు కూడ ఆదే విధముగా ఇష్టపడుము". అంతేగాని కేవలం నీవు నీ హక్కులను తీర్చుకొనుటకై న్యాయము, న్యాయమని ఆర్తనాదాలు చేస్తు, ఇతరుల హక్కుల విషయానికి రాగానే అందుకు భిన్నంగా ప్రవర్తించడం సమంజసం కాదు.

ఏ విధముగానైతే మనము మన హక్కుల సాధన కొరకు ఆందోళన చెందుతామో ఇతరుల హక్కులను నెరవేర్చుట కొరకు కూడ అంతే ఆందోళనకు గురి కావాలి. మననుండి పొరపాటు జరిగినప్పుడు మన పొరపాటుకు మన్నింపును కోరుకున్నప్పుడు, శిక్ష పడకూడదని ఆశించుకున్నప్పుడు ఇతరుల నుండి తప్పిదములు సంభవించినప్పుడు కూడ, అవి కావాలని చేయనప్పుడు, అతడు పదే పదే ఆ తప్పు చేయనప్పుడు అతనిని క్షమించే స్వభావం మనలో కూడ కలగాలి. ఒకవేళ అతని తప్పిదము సమాజం మొత్తానికి లేదా దేశానికి కలంకమునకు కారణమవుచున్నచో ఆ తప్పిదము అతని వ్యక్తిగత తప్పిదముగా భావించబడదు. అప్పుడు అతడు దేశ దోషిగా భావించబడును. అలాంటప్పుడు వారిని శిక్షించే విషయంను వ్యవస్థలు ఆలోచిస్తాయి కాని వ్యక్తులు కాదు.

మొత్తానికి నేను తెల్పునది ఏమనగా రోజువారి జీవితంలో పరస్పర విషయాలలో మనము మన హక్కులను పొందుటకు పోరాడుచున్నప్పుడు ఇతరుల హక్కులను మనము చెల్లిస్తున్నామా? లేదా?, లేక చెల్లించే ఆలోచన మనకు ఉన్నదా? లేదా? అని మన అంతరాత్మను పరిశీలించుకోవాలి. అందుకు ప్రాథమిక కేంద్రం గృహము. ఆ తరువాత సోదర సోదరిమణులు, బందు మిత్రువులు. ప్రాథమిక స్థాయిలోనే ఇతరులను గూర్చి ఈ ఆలోచన ఉన్నప్పుడు సమాజపరంగా కూడ ఈ ఆలోచన వృద్ధి చెందుతూ పోవును. స్వార్ధం అంతరించిపోవును. ఇతరుల హక్కులు చెల్లించుటకు అధికులు ముందుకు వచ్చెదరు. క్షమాగుణం కూడ సర్వ సాధారణమగును. శిక్షించు లేదా శిక్షింపజేయు ఆలోచనలు తగ్గిపోవును. బాహ్య హక్కులను చెల్లించు విషయాలతోపాటు, ఇతర అవసరాలను తీర్చుతు క్షమాగుణం అధికంగా అలవర్చుకొమ్మని అల్లాహ్ తాలా కూడ పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ విధముగా

తెలియజేయుచున్నాడు. " **అల్లజీన యన్ఫికూన ఫి స్సర్రాయి వజ్జర్రాయి వల్ కాజిమీనల్ ఘైజ వల్ ఆఫీన అనిన్నాసి వల్లాహు యుహిబ్బుల్ మొహసినీన్**" (ఆలే ఇమ్రాన్:135) అనగా సంపన్నులైనను, దారిద్రమున్నను ఖర్చు చేయువారు, తన కోపమును నిగ్రహించుకొను వారు, ఇతరులను క్షమించువారు, సత్కార్యములు చేయువారిని అల్లాహ్ తాలా ప్రేమించును.

పై సూక్తిలో అల్లాహ్ తాలా ప్రథమముగా అవసరమున్న తన దాసుల హక్కులను నెరవేర్చుట వైపు ప్రాధాన్యతను చూపించెను. అతడు పరోపకారియే అయినను ఇతరులకు సహాయము చేయువారు, ఇతరులకు ప్రయోజనంను చేకూర్చువారు, సత్కార్యములను చేయువారు, దైవభీతిని అవలంభించుకొను వారు, దైవ ప్రీతి కొరకు దైవభీతిని అనుసరిస్తు ఇతరుల ప్రయోజనాలను గూర్చి ఆలోచించువారు మాత్రమే నిస్వార్ధముగా, గుట్టు చప్పుడు కాకుండ, ఇతరులకు ఉదాహరణగా నిలుస్తూ అల్లాహ్ తాలా యొక్క భక్తుల అవసరాలను తీర్చుటకు ఖర్చు చేయుదురు. ఈ స్థితి మానవుడిలో కల్గినప్పుడు అతనిలో స్వార్ధబుద్ది ఉండదు. తన సోదరునికి చెడు తలపెట్టాలని ఆలోచించడు. ఇలాంటి వారే భక్తిలో కూడ వృద్ధి చెందుతారు. ఇలాంటి వారే అల్లాహ్ ప్రేమను పొందువారిలో చేర్చబడుదురు. మరల అల్లాహ్ తాలా పరోపకారుల లక్షణాల గూర్చి ఈ విధముగా తెల్పుచున్నాడు. పరోపకారులు వారి ఉద్రేకములను, ఆక్రోషములను హద్దులో పెట్టుకొందురు. కోపగించుకోవడం సహజ లక్షణం. అందుకై వారు తమ కోపమును నిగ్రహించుకున్న తరువాత క్షమించు సమయం వచ్చినప్పుడు వారు క్షమించుదురా? లేక ప్రతికారమునకు పూనుకుందురా? పరీక్షించబడుదురు. అన్ని రకాల కోపాలను, ప్రతికార చర్యలను హృదయం నుండి తొలగించడం సాధారణమైన విషయము కాదు. ఇది చాలా ఘన కార్యముగా భావించబడును. కోపం రాకుండా చూసుకోవడం, వచ్చిన కోపాన్ని హద్దులో ఉంచుకోవడం, గతంలో ఇలాంటిది ఏమి జరుగలేదు అనే విధముగా వాటిని పూర్తిగా హృదయము నుండి తొలిగించడం, అపకారం తలపెట్టిన వానికి ఉపకారం చేసి విడిచి పెట్టడం చాలా కష్టముతో కూడుకున్న పనులు. అయినా కూడ ఒక విశ్వాసిలో ఈ లక్షణాలు ఉండాలని అల్లాహ్ తాలా ఆశిస్తున్నాడు.

చరిత్ర పుటలలో హజ్రత్ హసన్ (ర) ఒక సంఘటణ గూర్చి ఇట్లు గలదు. వారి ఒక బానిస వలన ఒక తప్పిదము జరిగినది. అందుకు హజ్రత్ హసన్ (ర) కు చాలా కోపం వచ్చినది, పైగా ఆ బానిసను శిక్షించుటకు సిద్ధమైనాడు, ఇంతలోనే ఆ బానిస **వల్ కాజిమీనల్ ఘైజ** అనే సూక్తి పఠించెను. అందుకు వారు(ర) తన కోపమును నిగ్రహించుకొని అతనిని శిక్షించుటకు ఎత్తిన చేతిని క్రిందికి దించిరి. ఆ చర్యకు ఆ బానిసలో ధైర్యం రాగా **వల్ ఆఫీనా** అనే మరో సూక్తిని పఠించెను. అనగా ప్రజలను క్షమించువారని అర్ధం. అందుకు హజ్రత్ హసన్ (ర) నేను నిన్ను అల్లాహ్ ఆదేశానుసారం క్షమించాను వెళ్ళిపొమ్మని అనుమతినిచ్చెను. అందుకు ఆ బానిస **వల్లాహు యుహిబ్బుల్ మొహసినీన్** అనే సూక్తిని పఠించగా అనగా అల్లాహ్ తాలా ఉపకారం చేయువారిని ప్రేమించునని అర్ధం. అందుకు హజ్రత్ హసన్ (ర) ఆ బానిసను బానిసత్వం నుండి శాశ్వతంగా విముక్తిడిని చేసెను.

అల్లాహ్ తాలా ప్రేమను పొందాలని ఆశించువారు, ఇతరుల తప్పులను, పొరపాట్లను క్షమించడమే గాకా వారిపై ఉపకారము కూడ చేయుదురు.

ఈ సూక్తిని ఆధారం చేసుకొని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సందర్భమున ఇట్లు తెల్పిరి:

"కఠినత్వమును, కోపమును ప్రదర్శించు వారి నాలుకపై విజ్ఞాన, వివేక పూరిత ఉచ్చరణలు కొనసాగించబడవు. తన ఎదుటి వ్యక్తిపై త్వరగా కోపమునకు గురై అదుపు తప్పిన వారి హృదయములు విజ్ఞతను కోల్పోవును. అసభ్యతను కల్గిన మేదస్సు, గాడి తప్పిన పెదవులు వివేకపు చెలిమల నుండి చేయబడును. కోపము, వివేకం ఒకే చోట ఉండలేవు. కోపమునకు గురి అయ్యే వ్యక్తి మేదస్సు మందగించును. ఆలోచన శక్తిని కోల్పోవును. అతడు అన్ని రంగాలలో అపజయమునకు, నిస్సహాయతకు గురి అవును. కోపము పిచ్చితనములో అర్ధ భాగము. అది ఉద్రేకించినప్పుడు పూర్తి పిచ్చివాడిగా మారును".

(మల్ఫూజాత్ సంపుటి5, పుట 126-127, ఎడిషన్ 1985, ప్రచురణ లండన్)

వారు (అ) మరల ఇట్లనిరి: "గుర్తుంచుకొనుము వివేకం, ఉద్రేకం రెండింటిలో భయంకరమైన శత్రుత్వం గలదు. కోపం, ఉద్రేగములు వచ్చినప్పుడు వివేకం మాయమగును. కాని సహనం వహించువారికి, ఓర్పు ప్రదర్శించు వారికి ఒక తేజస్సు ప్రసాదించబడును. తద్వారా వారి వివేకములో, విజ్ఞతలో నూతన శక్తులు ఉద్భవించును. ఆ తేజస్సుతో మరో తేజస్సు ఉత్పన్నమగును. కోపం, ఉద్రేక సమయాలలో హృదయంలో అంధకారము కల్గును కావున అంధాకరంతో అంధాకరమే జనించును".

(మల్ఫూజాత్ సంపుటి3, పుట 180, ఎడిషన్ 1985, ప్రచురణ లండన్)

అందుకే ఇస్లామీయ బోధనలు ఎంతో వివేక వంతమైనవి. ఒకవేళ ఎవరైనా తప్పుచేసినచో, తీర్మాణ సమయంలో తీర్మాణం చేయునపుడు ఎదుటి వ్యక్తి శత్రువైనను, లేదా శిక్షించుటకు అర్హుడైనను ఆలోచించి తీర్మాణం చేయాలి గాని, కోపంతో ఉద్రేకంతో తీర్మాణం చేయకూడదు. కొన్ని సందర్భాలలో కఠినత్వమును ప్రదర్శించవలసి వస్తుంది. అయినా కూడ కోపంలో, ఉద్రేకంలో కఠినత్వమును ప్రదర్శించకూడదు. ఇస్లాంలో శిక్షించు ధోరణి కూడ గలదు. కాని అందుకు కూడ కొన్ని నిబంధనలు, విధానాలు గలవు, వాటిని అతిక్రమించ కూడదు. ఉద్రేకంలో శిక్షించుట ద్వార, వివేకమును కోల్పోవుదురు, న్యాయము నుండి దూరం వెళ్ళుదురు. అందువలనే వారు (అ) ఇట్లు ఉపదేశించిరి, కోపంలో శిక్షించినచో అది హృదయ కఠినత్వంగానే భావించబడుతుంది. హృదయం కఠినమైనప్పుడు మేదస్సుకు విజ్ఞత, వివేకము లభించదు. తద్వారా బుద్ది మందగించును. అందువలనే కోపంను నిగ్రహించుకొనుమని, మేదస్సును శాంతింప జేసుకొనుము. ఆ తరువాత నీవు శిక్షించే హక్కు కల్గిన వాడివైనచో శిక్షించాలా? లేక మన్నించాలా? అని ఆలోచించుమని అల్లాహ్ తాలా ఆదేశించినాడు. అందరికి శిక్షించే హక్కు ఉండదు. కోపాన్ని నిగ్రహించుకొనుటకు సహనశీలత చాలా ముఖ్యము. అందుకే తమలో సహనమును అలవర్చుకొనుము. వారు (అ) మరల ఇట్లనిరి. సహనం వహించు వారి విజ్ఞత, వివేకములకు తేజోవంతమైన శక్తి చేకూరును. వారి ఆలోచనలు అర్ధవంతమైనవిగా యుండును. వారికి బుద్ది శక్తి లభించును. వారికి దైవం నుండి కూడ మార్గదర్శకం లభిస్తుంది. ఒక విశ్వాసి ఏదేని విషయములో విజ్ఞతతో తీర్మాణించినచో అది అయిష్టతతో కూడినదైనను తీర్మాణంలో తొందరపడకుండా ఓర్పుతో, సహనంతో, ఆలోచనతో న్యాయాన్యాయాలను నిశితంగా, ప్రగాఢంగా పరిశీలించి తీర్మాణించును.

నేను తేల్పినట్లుగా శిక్షించే అధికారం అందరికి ఉండదు. నేను ఆలోచించాను శిక్షించాలనే నిర్ణాయానికి వచ్చాను అందుకే శిక్షించాను అంటే సరిపోదు. శిక్షించు అధికారం ఆయా వ్యవస్థలకే ఉంటుంది. తప్పిదము జరిగిన వ్యక్తిని మానవుడు క్షమించవచ్చును. కాని శిక్షించుటకు మాత్రం చట్టపు అనుమతి, ఆయా వ్యవస్థల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ విషయమును ప్రతి ఒక్కరు తమ దృష్టిలో ఉంచుకున్నచో చిన్న చిన్న విషయాలకే పెద్ద పెద్ద గొడవలు జరగకుండా జాగ్రత పడవచ్చును. ఒకరిపై మరొకరు వాజ్యములు వేసుకొని సమయాన్ని, ధనాన్ని వృధా చేసుకోకూడదు. న్యాయస్థానాలు ఏ దోషినైన నిర్దోషిగా తీర్మాణించినచో అతనిని ఎందుకు మన్నించారని లేదా అతనికి ఎందుకు ఇంత చిన్న శిక్ష విధించారని ఎదుటి పక్షం వారికి కోపం కట్టలు తెంచుకొని వచ్చును. అప్పుడు ఎదుటి పక్షం వారు మరో ఉన్నతమైన న్యాయస్థానంను ఆశ్రయించును. అంశాలు కూడ అంత పెద్దగా ఏమి ఉండవు. అన్ని చిన్న చిన్న విషయాలే. కొందరు అహ్మదీయులు ఈ మధ్య కాలంలో మేము ఖజాలో తీర్మాణం చేయించుకోమని అభిప్రాయ పడుతుంటారు. న్యాయస్థానాలకు వెళ్ళుదురు. వాస్తవానికి నిశితంగా పరిశీలించినచో వారు ప్రస్తావించే అంశాలు న్యాయస్థానాలకు వెళ్ళునంత జటిలమైన అంశాలుగా ఏమి ఉండవు. అందువలన వారే స్వయముగా నష్టాన్ని కొనితెచ్చుకుందురు. కోపమును నిగ్రహించుకొన్న పిదప, క్షమించవలెనని అల్లాహ్ తాలా వివేకరహితముగా ఆదేశించలేదు. క్షమించడం, శిక్షించడం వలన కల్గు మంచి చెడులను ఆలోచించి తీర్మాణించుమని ఆదేశించడమైనది. ఈ విషయమును గూర్చి అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో " **జజాఉ సయ్యిఅతి సయ్యిఅతి మిసులుహా ఫమన్ అఫా వ అస్‌ల ఆ ఫ అజ్‌రుహు అలల్లాహి ఇన్నహు లా యుహిబ్బు జ్వాలిమీన్**" (అశ్శూరా:41) అని తెల్పెను.

**జజాఉ సయ్యిఅతి సయ్యిఅతి మిసులుహా** అనగా చెడుకు ప్రతీకారం చేయబడిన చెడుకు సమానముండును. తప్పును దిద్దుకొను వాడైనచో వానిని క్షమించు వానికి దాని ప్రతిఫలం అల్లాహ్‌యే నొసంగును. నిశ్చయముగా అల్లాహ్ అన్యాయ పరులను ఇష్టపడడు.

కావున ఇక్కడ ముఖ్యమైనది దోషికి తాను చేసిన తప్పును తెలియజేస్తూ అతనిని సంస్కరించుట. అంతేగాని ప్రతీకారం తీర్చుకొనుట అసలు ఉద్దేశము కాకూడదు. అంతేగాని వాజ్యములలో చిక్కుకొని, తన ధనమును వృధా చేసుకొనుచు ఎదుటి వారి ధనమును కూడ వృధా చేయించుట, తన సమయంను నాశనం చేసుకొని, ఇతరుల సమయాన్ని నాశనం చేయుట, ఒకవేళ జమాఅత్ వ్యవస్థలలో అయినచో వాటిని గూర్చి ఇతరుల హృదయాలో అపోహలను కల్పించుట ముఖ్యము కాకూడదు. ఒకవేళ క్షమించినచో అతనిలో మార్పు వచ్చునని భావించినచో అతనిని క్షమించుటయే ఉత్తమము. ఒకవేళ అతనిని శిక్షించినచో అతనిలో మార్పు వచ్చునని భావించినచో అతనిని శిక్షించుటయే ఉత్తమము. అందుకు సంబంధిత వ్యవస్థాపకుల వరకు విషయమును తీసుక వెళ్ళినను సబబే అవును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విజ్ఞతతో కూడిన విషయమును గూర్చి అనేక చోట్ల ప్రస్థావించడమైనది. తర్యాకుల్ ఖులూబ్ పుస్తకములో ఒక చోట వారిట్లు వ్రాసిరి:

"చట్టా శిక్షాస్మృతి ప్రకారం ప్రతి చెడుకు అందుకు సమానమైన చెడును కల్గించుటయే శిక్ష. కాని ఒక వ్యక్తి ఆ దోషిని క్షమించడం వలన అతనిలో మార్పు సంభవించునని గ్రహించినచో, ఒకవేళ క్షమించినచో అతడు తప్పులు చేయుటలో మిక్కిలి సహసం చూపువానిగా, భయంకరుడిగా మారడని భావించినచో అతనిని క్షమించుటయే ఉత్తమము, అట్టి వ్యక్తి అల్లాహ్ తాలా నుండి అతి ఉత్తమమైన బహుమానంను పొందును".

(తర్యాకుల్ ఖులూబ్, రూహాని ఖజయిన్ సంపుటి 15, పుట 163)

మరల బరాహీనే అహ్మదియ్యలో ఇట్లు పేర్కొనిరి:

" చెడును అంతమొందించుటకు సమన్యాయము ఏమినటనగా చెడు

తలపెట్టిన వ్యక్తికి అతను తలపెట్టినంతయే శిక్షించవలెను. కాని ఒకవేళ ఏ వ్యక్తి అయిన దోషిని క్షమించి అతని సంస్కరణకు శ్రీకారం చుట్టినచో అనగా క్షమించడం వలన ఎలాంటి చెడు సందేశం ఇతరులకు చేరకున్నచో అట్టి క్షమించిన వ్యక్తికి ప్రతిఫలం అల్లాహ్ నొసంగును". (బరాహీనే అహ్మదియ్య రూహానీ ఖజాయిన్ సంపుటి1, పుట433-434 అనుబంధమునకు అనుబంధము సంఖ్య 3), అనగా సంస్కరణ కొరకు క్షమించబడినచో అది సత్కార్యమగును. అందుకు నిబంధన ఏమిటనగా అట్టి క్షమాపణ వలన అధిక చెడు ప్రబలకూడదు. ఎలాంటి చెడుకు ఆస్కారం లేనప్పుడు క్షమించే వ్యక్తికి ప్రతిఫలం అల్లాహ్ తాలా నొసంగునని తెల్పుచున్నాడు. అల్లాహ్ తాలా ఎంత అనుకుంటే అంత ప్రతిఫలంను అందించును.

కావున క్షమించడం, మన్నించడం అనేది ఇకపై ఎలాంటి తప్పు జరుగకుండా తగిన జాగ్రతలు తీసుకొనునని అపరాధిలో స్పష్టముగా కనిపించినప్పుడు ఫలితము నిచ్చును. కొందరు అలావాటు పడిన అపరాదులు ఉంటారు. తప్పు చేసిన ప్రతిసారి ఇకపై తప్పు చేయమని, క్షమించమని వేడుకొంటారు. అలాంటి వారిని తప్పక శిక్షించవలెను. శిక్ష కూడ అతని సంస్కరణకు దోహద పడునట్లు ఉండవలెను.

మరొక చోట వారు (అ) ఇట్లు తెల్పిరి: " చెడుకు ప్రతిఫలం తాను చేసినంత చెడుకు సమానమై మాత్రమే ఉండాలి. కాని ఎవరైతే వారిని క్షమించి, వారి పాపములను మన్నించుదురో, అట్టి మన్ననల వలన అతను గతంలో కన్న అధిక చెడుకు పాల్పడకుండా అతనిలో మార్పు సంభవించినచో మన్నించు వ్యక్తిని అల్లాహ్ ప్రేమించును. తన నుండి ప్రతిఫలమును అందించును. పవిత్ర ఖుర్ఆన్‌లో తప్పు జరిగిన ప్రతి చోట శిక్షించాలని ఎక్కడ లేదు. అదే విధముగా అన్ని చోట్ల మన్నించాలని కూడ ఎక్కడ లేదు. సమయ సందర్భాను కూలంగా నడుచుకోవాలని ఆదేశించడమైనది. శిక్షించాలా, మన్నించాలా అనునది వ్యక్తి స్వభావంను దృష్టి యందుంచుకొని నిర్ణయము తీసుకోవాలి. విచ్చలవిడిగా ఉండకూడదు. ఈ విషయమునే పవిత్ర ఖుర్ఆన్ బోధిస్తున్నది.

(కిష్తియే నూహ్, రూహానీ ఖజాయిన్ సంపుటి19, పుట 30)

ఎలాంటి నిబంధనలు లేకుండా, ఎలాంటి షరతులు లేకుండా శిక్షించడం, క్షమించడం సరికాదు. అందు కొరకు ఒక హద్దు గలదు, హద్దులో ఉంటూ ఎందులో లాభము ఉండునో చూడవలెను. క్షమించడం, శిక్షించడంలో గల వివేకతతో కూడిన ఇస్లామి శిక్షాస్మృతి ఇది.

నేడు మనము ప్రపంచ శిక్షాస్మృతిలో ప్రతి తప్పుకు శిక్షించడంను చూస్తున్నాము. వారి సంస్కరణ పేరుతో ఖైదీలను ఏళ్ల తరబడి జైలులో ఉంచడం జరుగుతుంది. కాని సంస్కరణ కోసం జైలులో నిర్బందించిన ఖైదీలు వారి శిక్షానంతరం బయటకు వచ్చి ఇంకా ఎక్కువ పాపపు పనులు చేస్తున్నారని నేటి యూరప్ పత్రిక కారులు వ్రాస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతున్నదనగా శిక్షించేవారు. శిక్షను అనుభవించే వారు ఇద్దరు చట్టానికి కట్టుబడి ఉంటారు. వారిలో దైవభీతి ఉండదు. మొత్తానికి విశ్వాసులకు గల సాధారణ ఆదేశమేమనగా, కారకులను క్షమించే గుణంను అలవర్చుకోవాలి. తప్పిదపు పరిమాణం, దోషి పరిస్థితులు, గత నడవడికను దృష్టియందుంచుకొని తీర్మాణించాలి. కన్నులు మూసుకొని గ్రుడ్డివారిగా అందరిని క్షమిస్తూండాలని లేకా కోపోద్రిక్తుడివై అందరిని శిక్షిస్తూ ఉండాలని అల్లాహ్ తాలా కోరడం లేదు. అందరిని క్షమిస్తూ పోయినచో సమాజంలో చెడు ప్రబలిపోవును. అందరిని శిక్షిస్తూ వెళ్ళినచో పరస్పర శత్రుత్వంలు హెచ్చుతూ పోవును. ఫలితంగా సమాజంలో ద్వేషపూరితమైన వాతవరణం నెలకొనును. అశాంతి చెలరేగును.

ఒకవేళ మనము మన పరిసరాలను గమణించినచో మనకు తెలియు విషయమేమనగా, ఎవరికైతే అన్యాయం జరిగినదో, వారు అన్యాయం తలపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని, తద్వారా ఇతరులు కూడ ఇక పై ఎలాంటి తప్పుడు పనులు చేయాలన్న భయము కలగాలి అని పట్టుబడుతారు. అదే విధముగా ఎవరైతే తప్పు చేస్తారో వారు తప్పకుండా క్షమించాలి, క్షమించడం వలన కారకుడు తన తప్పును తాను తెలుసుకొని సంస్కరించుటకు ప్రయత్నించునని వాదిస్తుంటాడు. నేడు మానవ హక్కుల సంఘాలు కూడ అధికమైనవి. ఆయా సంఘాలు అక్కడక్కడ మంచి పనులు చేస్తున్నప్పటికి, అన్ని చోట్ల క్షమించుట వైపే అధిక ప్రధాన్యతను కనబర్చుతున్నాయి. ప్రతి దోషిని క్షమించివేస్తున్నాయి. అదే విధముగా తప్పుచేయు వారిలో ఎవరైన కొద్ది గొప్ప ధార్మిక విద్యను కల్గిన వారు కూడ అల్లాహ్ తాలా క్షమించమని తెలుపుచున్నాడని, తద్వారా అల్లాహ్ తాలా కూడ మిమ్ములను క్షమించును, కావున మీరు కూడ అతని దాసుల హక్కులను చెల్లిస్తూ క్షమించి వేయుమని వాదిస్తుంటారు. వ్యక్తి గతంగ కూడ ప్రతి ఒక్కరు కారకులను క్షమించి వేయాలి. జమాఅత్‌కు నష్టము వాటిల్లుతుందా? లాభము చేకూరుతుందా? అని చూసుకోకుండా జమాఅత్ పరంగా కూడ అందరిని క్షమించాలి, అప్పుడు దైవ దాసుల హక్కులు చెల్లించిన వారగుదురని వాదిస్తుంటారు. ఈ రెండు విధాలుగా వాదించే వారు ఒకరు అలవాటు ప్రకారం తప్పులు చేసేవారు లేదా న్యాయాన్ని కాలరాస్తూ తనకు అనుకూలంగా తీర్పునిప్పించు కొనుటకు ప్రయత్నించు వారై ఉందురు. ప్రథమముగా వారు తప్పు చేస్తారు, చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడం కొరకు దైవాదేశాలను ఆధారంగా చూపుతారు. ఇలాంటివారు స్వార్ధపరులు. ఒకవేళ వీరికి ఎవరైన అన్యాయము తలపెట్టినచో ఏనాడు వీరు క్షమించరు. పైగా ముందుకు వచ్చి దోషికి పడవలసిన శిక్ష కన్న అధిక శిక్షను వేయించెదరు. అనగా వారి సిద్ధాంతాలు ఇక్కడ మారిపోవును. అప్పుడు వారు నీవు ఇష్టపడు వస్తువునే ఇతరులకు ఇష్టపడుమనే దైవాదేశమును మరచిపోతారు.

అదే విధముగా ఎవరైతే క్షమించుటకు సిద్ధముగా ఉండరో, తనకు హాని కల్గించిన వారికి తప్పకుండా శిక్ష పడాలని ఎదురుచూసునో వారు కూడ ఒకవేళ తప్పు చేసినచో క్షమించడమే ఉత్తమమని క్షమాపణాలు కోరుకొందురు. ఇస్లాం ఇలాంటి స్వార్ధ పరుల వాదనలను ఖండిస్తున్నది. చాలా స్పష్టమైన, న్యాయబద్ధమైన తీర్మాణంను చేయమని ఆదేశిస్తున్నది. అనగా క్షమించడం వలన అతనిలో మార్పు వస్తుందని గమణించినచో క్షమించుము, ఒకవేళ శిక్షించనిచో అతనిలో ఎలాంటి మార్పు రాదని గ్రహించినచో తప్పకుండా శిక్షించుము. మొత్తానికి ఇది ఇస్లామీయ బోధన.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంత వరకు క్షమించేవారో, తమ అనుచర వర్గానికి ఏ విధమైనటు వంటి ఉపదేశాలను అందించారో ఇప్పుడు మనము పరిశీలిద్దాం. హజ్రత్ ఇమాం హసన్ (ర) ఉదాహరణను నేను ముందే తెల్పినాను. వారు ఒక బానిస చేసిన తప్పును క్షమించి వేసిరి. వాస్తవానికి అది సాధారణమైన తప్పిదము. క్షమించుటలోని ఉత్తమ ఆదర్శము హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితంలో మనకు కనిపించును. శిక్షించాలని ఆదేశించబడిన వారిని కూడ వారు (స) క్షమించి వేసిరి. కేవలం సాధరణమైన వారినే కాకుండా, తనకు నష్టము కల్గించిన వారిని, తన సంతానమునకు నష్టము కల్గించిన వారిని కూడ వారు (స) క్షమించి వేసిరి. ఎందుకనగా వారు తమను తాము సంస్కరించుకొనిరి.

ఒక హదీసులో ఇలా గలదు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కుమార్తే మజ్రత్ జైనబ్ (ర) మక్కా నుండి మదీన వైపు ప్రస్థానము చేయుచుండగా, ఒక వ్యక్తి హబ్బార్ బిన్ అస్వద్ వారి(ర)ని హత్య చేయుటకు దాడి చేయగా గర్భవతిగా ఉన్న హజ్రత్ జైనబ్ గారి గర్భము పోయెను. అనంతరం ఆ గాయము వలన వారు (ర) కూడ మరణించిరి. ఈ నేరము కారణంగా హబ్బార్‌ను హతమార్చాలని నిర్ణయించిరి. మక్కాపై విజయము పొందిన తరువాత ఈ వ్యక్తి దూరంగా పారిపోయి తల దాచుకొనెను. ప్రవక్త గారు మదీన చేరుకున్న తరువాత హబ్బార్ హుజూర్ గారి సేవలో హజరై నన్ను కరుణించుము. ముందుగా నేను భయభ్రాంతుడనై పారిపోయి యుంటిని, కాని నీ కరుణ,దయ నన్ను తిరిగి తీసుక వచ్చినదని, ఓ దైవ సందేశహరుడా! మేము మూర్ఖులుగా ఉంటిమి. అన్యారాధనలు చేయు చుంటిమి, మీ ద్వారా అల్లాహ్ తాలా మాకు మార్గదర్శనమును చూపెను. వినాశనమును నుండి మమ్ము రక్షించెను. నేను నా నేరములను అంగీకరిస్తున్నాను. నా మూర్ఖత్వమును మన్నించి నన్ను క్షమించగలరని వేడుకొనగా, తమ కుమార్తె హంతకున్ని కూడ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం క్షమించి, సరే ఓ హబ్బార్ ! నేను నిన్ను క్షమించాను అని తెలుపగా అతడు ఇస్లాంను స్వీకరించెను. మరల వారు (స) ఇట్లనిరి, అల్లాహ్ తాలా మిమ్ము లను ఇస్లాంను స్వీకరించేందుకు అనుగ్రహించి మీపై ఉపకారము చేసెను. సంస్కరణ జరిగినదని గమణించి వారు (స) తమ కుమార్తె హంతకున్ని కూడ క్షమించి వేసిరి.

(తారికుల్ ఖమీస్, సంపుటి2, భాగం జికిరి రిజ్జాల్ అల్ అహద అషరర్జునా యౌముల్ ఫతహ్ మక్కత, పుట 93)

హజ్రత్ ఆయిషా (ర) ఇట్లు తెల్పిరి: తమపై జరిగిన దౌర్జన్యమునకు కూడ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏనాడు ప్రతీకారం తీర్చుకొనుటకు ప్రయత్నించలేదు.

(సహీ ముస్లిం, కితాబుల్ ఫజాయిల్ బాబ్ ముబాఅదతులు అసామ్........హదీస్ 5944)

అందుకే అహారములో విషం కల్పిన యూదురాలిని కూడ క్షమించిరి. వాస్తవానికి కొందరు అనుచరులపై విష ప్రభావం కూడ చూపెను.

(సీరత్ ఇబ్నే హష్షామ్, బాబ్ బకియ్యత్ అమరే ఖైబర్ 626-627)

అదే విధముగా ఒహద్ యుద్ధంలో తమ చిన్నాన్న హజ్రత్ హంజ (ర) శవమును అవమానపర్చిన, వారి (ర) శరీర అవయవాలను కోసిన, చెవులు, ముక్కును కోసి కాలేయంను నాలుకతో చప్పరించిన హింద మక్కాపై హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం విజయము సాధించిన తరువాత మహిళలో కలసి బైఅత్ చేసి ఇస్లాంను స్వీకరించెను. కొన్ని ప్రశ్నల వలన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆమెను గుర్తించి నీవు అబూ సుఫియాన్ భార్య హిందావేనా? అని ప్రశ్నించగా, ఓ ప్రవక్త ఇప్పుడు నేను మనస్ఫూర్తిగా ఇస్లాంను స్వీకరించాను. గతంలో జరిగిన దానిని క్షమించుమని వేడుకొనగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హిందను కూడ క్షమించిరి. హిందాపై వారి (స) క్షమాపణ ఎంత ప్రభావాన్ని చూపినదనగా ఆమె పూర్తిగా మారిపోయినది. చాలా స్వచ్ఛతను అలవర్చుకున్నది. అంతేగాకా ఆ రోజు సాయంత్రము హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భోజనం కొరకు రెండు మేకలను వేంచి పంపించి ఈ రోజులలో పశువులు తక్కువగా ఉన్నందున ఈ చిన్న కానుకను స్వీకరించగలరని సందేశం పంపగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి కొరకు ఓ అల్లాహ్ హిందా పశువులలో చాలా శుభములను చేకూర్చుమని దుఆ చేసిరి. ఆ దుఆ ఫలితముగా ఆమె తన పశువులను అదుపు చేసుకోలేనంతగా వృద్ధి చెందాయి.

(సిరాతుల్ హల్‌బియా సంపుటి3, పుట 137-139)

దాంభికుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ అబీ బిన్ సులూల్‌ను గూర్చి

అందరికి తెలుసు, అతడు చేసిన అవమానలన్నింటిని క్షమించి, హజ్రత్ ఉమర్ (ర) చదువించ వద్దని ప్రాధేయపడిన కూడ అతని అంతక్రియ ప్రార్ధనను కూడ చదువించిరి.

( సహీబుఖారి, కితాబుల్ జనాయజ్ బాబ్ మా యక్రహు మిన్ స్వాలాత్ అలల్ మునాఫికీనా, ...... హదీస్ సంఖ్య 1366)

కాబ్ బిన్ జహిర్ ఒక ప్రఖ్యాత కవి, కొన్ని విషయాల వలన అతనిని కూడ హత మార్చవలెనని హుజూర్ గారు ఆదేశించిరి. మక్కా విజయము తరువాత అతని సోదరుడు అతనిని హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి వచ్చి క్షమాపణ కోరమని లేఖ వ్రాసెను. అందువలన కాబ్ బిన్ జహిర్ మదీన వచ్చి తనకు పరిచయం ఉన్న ఒక వ్యక్తి వద్ద బస చేసెను. ఫజర్ నమాజ్‌ను హుజూర్ సల్లల్లాహు అలైహి వస్లలం గారి వెనుక సలిపెను. నమాజ్ తరువాత హుజూర్ గారి సన్నిధిలో ఉపస్థితులై, ఓ రసూలుల్లాహ్! కాబ్ బిన్ జహిర్ ప్రాయశ్చిత్తముతో వచ్చి క్షమాపణలను కోరుచున్నాడు, అనుమతి లభించినచో అతనిని మీ ముందు ప్రవేశపెట్ట బడునని తెలుపెను. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం గతంలో కాబ్ బిన్ జహిర్‌ను చూడనందున గుర్తుపట్టలేక పోయిరి. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సరే అనుమతి ఇస్తున్నాను హాజర్ కమ్మని చెప్పమని తెల్పగా, ఓ రసూలుల్లాహ్! కాబ్ బిన్ జహిర్‌ను నేనేనని అతడు ప్రకటించుకొనెను. వెంటనే ఒక అన్సారి అతనిని హతమార్చుటకు నిలబడగా ఇతను ప్రాయశ్చిత్తముతో వచ్చినాడు ఇతనిని వదిలివేయుమని ఆ అన్సారిని ఆదేశించెను. అనంతరం అతడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రశంసిస్తూ ఒక పద్యమును కూడ వినిపించెను. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆనందమును వ్యక్త పర్చుతూ తన దుప్పటిని కాబ్ బిన్ జహిర్‌కు బహుమానంగా నొసంగి, దీవించి పంపెను.

(తారికుల్ ఖమీస్ సంపుటి2, బాబ్ ఇస్లాం కాబ్ బిన్ జహిర్, పుట 121)

వారు క్షమించినటువంటి ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. కేవలం క్షమించడమే గాకుండా బహుమానలతో సత్కరించి, దీవించి పంపడం జరిగినది. ఇలా వారు మానవ జాతియే ఆశ్చర్యమునకు గురిఅవు విధముగా క్షమాపణల ఉదాహరణలను వారు (స) నెలకొల్పిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెల్పిరి: దేవుని అవతారులను చాలా దారుణంగా దూషించడం జరిగినది. చాలా ఘోరముగా ఇబ్బందులకు గురిచేయడమైనది. అయినా కూడ వారికి “**ఆ అరిజ్ అనిల్ జాహిలీన్** ” అనే బిరుదునివ్వడం జరిగినది. ముఖ్యంగా మన సంపూర్ణ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను కూడ చాలా కష్టాలకు గురి చేసిరి. వారి (స) పట్ల దుష్పదములు వాడిరి, దుర్భాషలాడిరి, హేళన చేసిరి. కాని ఆ మానవ ఘనుడు అందుకు ప్రతికారముగా ఏమి చేసాడు? వారి కొరకు దుఆ చేసాడు. మూర్ఖుల నుండి దూరమున్నచో నీ గౌరవమును, నీ ప్రాణమును రక్షించబడును, ఈ దారి దోపరులు నిన్ను ఏమి చేయలేరనే అల్లాహ్ తాలా వాగ్దానం ప్రకారం మూర్ఖుల నుండి దూరం ఉండగా, హుజూర్ గారి శత్రువుల వారి గౌరవముపై ఎలాంటి దాడులు చేయలేకుండిరి. పైగా వారే అధముల్లై, నీచులై హుజూర్ గారి పాదాల క్రిందకు వచ్చిరి. లేక వారి(స) గారి జీవితంలోనే నాశనమైరి”.

( మల్ఫూజాత్ సంపుటి 1, పుట 108)

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు తమ అనుచరులకు నేర్పించిన క్షమా, దయా గుణాల ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నవో వాటిని గూర్చిన కొన్ని సంఘటనలను మీ ముందు వివరించెదను.

ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి సన్నిదిలో హాజరై ఓ రసూలుల్లాహ్! నా వద్ద గల నా బానిస ఎప్పుడూ పొరపాట్లు చేస్తూనే ఉంటాడు. నేను అతనిని శారీరకంగా శిక్షించవచ్చునా? అని ప్రశ్నించగా, అతనిని నీవు రోజు 70 సార్లు క్షమించుమని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సెలవిచ్చిరి.

(మజుమూఆ అజ్జవాహిద్ సంపుటి4, పుట 309 కితాబుల్ అతక్ హదీస్ సంఖ్య 7231)

అనగా చాలా అధికంగా క్షమించుమని అర్ధం. ఇది ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన అనుచరులకు తమ సేవకుల పట్ల, తమ బానిసల పట్ల చూపించవలెనని నేర్పించిన సత్ప్రవర్తన ప్రమాణము.

ఇచట నేను ఈ విషయమును కూడ తెలుప దలుచుకున్నాను. నేడు బానిసలు లేరు. అందువలన ఒక విశ్వాసియైన ఉద్యోగి నుండి వారికి అప్పగించిన బాధ్యతల హక్కులను నెరవేర్చునని నమ్మకం ఉంటుంది. క్షమించమని ఆదేశము ఉన్నది కదా అని పొరపాట్లపై పొరపాట్లు చేసుకొంటు వెళ్లడం కూడ సబబు కాదు. ఏ విధముగానైతే ఇతర విషయాలలో ఈ ఆదేశము వర్తించునో అదే విధముగా తమకు అప్పగించిన బాధ్యతలను తప్పకుండా నెరవేర్చుతూ వాటి హక్కులను నెరవేర్చవలెను. కావున రెండువైపుల ఈ ఆదేశం ఉన్నందున యజమానులు చిన్న చిన్న విషయాలకే కోపగించు కోకూడదు, క్షమించాలి. అదే విధముగా ఉద్యోగులు కూడ తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి శ్రద్ధతో నెరవేర్చవలెను.

క్షమాపణ మరియు మన్నింపుల విషయములను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు ఈ విధముగా ఉపదేశించిరి: “ జమాఅత్ స్థాపనలో గల ముఖ్యోద్దేశమేమనగా నోటిలో, చెవులలో, కన్నులలో, చివరికి అవయవము లన్నింటిలో దైవభీతి ప్రవహించ వలెను. దైవభక్తితో కూడిన తేజస్సు వారిలో అంతరంగికములో, బాహ్యములో వికసించవలెను. సులక్షణాలు చాలా ఉన్నత స్థాయికి చేరవలెను. అనవసరంగా కోపం, ఆవేశం రాకూడదు. జమాఅత్ సభ్యులలో కోపం ఉండుటను నేను నేటికి గమనిస్తూనే ఉన్నాను. చిన్న చిన్న విషయాలకే ఆవేశానికి గురై పోతారు. పరస్పరం తగువులాడు కొంటారు. అలాంటి వారికి జమాఅత్‌తో ఎలాంటి సంబంధము లేదు. ఒకరు తిట్టుచున్నప్పుడు మరొకరు సమాధానం ఇవ్వకుండా మౌనంను పాటించుటలో గల ఇబ్బంది ఏమిటో నేటికి నాకు అర్ధం కావడం లేదు. ప్రతి ఒక్కరి సంస్కరణ ముందుగా సుగుణాల నుండే ప్రారంభమగును. అందుకే ప్రారంభములోనే సహనంను పాటించినచో శిక్షణలో వృద్ధి కల్గును. అన్నిటి కన్న ఉత్తమమైన విధానము ఏమిటనగా ఎవరైన దుర్భాష లాడినప్పుడు అల్లాహ్ తాలా వారిని సంస్కరించుమని వారి కొరకు హృదయావేధనతో దుఆ చేయుము. హృదయంలో ఈర్ష్యకు స్థానమివ్వకుము. మృదుత్వం, సహనం, క్షమాగుణం వంటి స్థానములో కఠినత్వం ఆక్రమించడంను అల్లాహ్ తాలా ఏ మాత్రం ఇష్టపడడు. ఒకవేళ నీవు సులక్షణాలలో వృద్ధి చెందినచో త్వరగా దైవానుగ్రహమును పొందెదవు. మానవులందరరు ఒకే స్వభావంను కల్గి ఉండరనేది సత్యం. అందుకే అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో **కుల్లు యాఅమలు అలా షాకిలతి** (బని ఇస్రాయిల్: 85) అని తెలుపెను. కొందరు ఒక గుణంలో ఉత్తముల్లైనచో, ఇతర గుణాలలో బలహీనులుగా ఉందురు. ఒకరి గుణం మంచిగా ఉన్నచో మరొకరి గుణం చెడుగా ఉండును. అందుకని మానవుని సంస్కరణ సాధ్యము కాదని మనము చెప్పలేము.

(మల్ఫూజాత్ సంపుటి 7, పుట 127-128)

అందరి స్వభావాలను అల్లాహ్ తాలాయే సృష్టించాడు. కొందరు కొన్ని సుగుణాలలో ఉత్తమముగా ఉందురు, అందులో వృద్ధి చెందుతూ పోవుదురు. కాని మరికొందరు బలహీనులుగా ఉందురు. అంత మాత్రమునే వారి సంస్కరణ సాధ్యము కాదని మనము చెప్పలేము.

మానవుని స్వభావములు వివిధాలుగా ఉన్నప్పటికి, బలహీన స్వభావంలు గల వారిలో కూడ కొన్ని మంచి అలవాట్లు ఉండును. అందరిలో బలహీనతలే ఉండును, మంచి కోణాలు ఉండవనడం సరికాదు. మంచి అలవాట్లు కూడ గలవు, చెడు అలవాట్లు కూడ గలవు. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనము అల్లాహ్ తాలా ఆదేశాను సారంగా నడుచుకుంటూ మనలను మనమే సంస్కరించుటకు ప్రయత్నించాలని కోరుకుంటున్నారు. అంతేగాకా ఒక విశ్వాసికి ఉండవలసిన సులక్షణాలలో ఉన్నత శిఖరాన్ని అధిరోహించాలని కూడ ఆశిస్తున్నారు. బలహీనతలను దూరం చేసుకొనుటకు ఎల్లప్పుడు ప్రయత్నించాలి. అంతేగాకా మన పరిసరాలను కూడ శాంతియుతంగా ఉంచుకొనుటకు ప్రయత్నించాలి. అందుకొరకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిన ప్రమాణికమును “దేనినైతే నీ కొరకు ఇష్టపడుదువో దానిని ఇతరుల కొరకు ఇష్టపడుము” ప్రకారం పాటించుటకు ప్రయత్నించాలి.

అల్లాహ్ తాలా మనందరికి ఈ ప్రమాణికమును అనుసరిస్తు జీవనమును సాగించు భాగ్యమును నొసంగును గాకా! (ఆమీన్)

**ఇహపరలోకములో క్షేమమును యాచించు దుఆ**

హజ్రత్ మూసా అలైహిస్సలాం తమ జాతి కొరకు ఈ దుఆ చేసిరి.

وَاكْتُبْ لَنَا فِي هَٰذِهِ الدُّنْيَا حَسَنَةً وَفِي الْآخِرَةِ إِنَّا هُدْنَا إِلَيْكَ

మా కొరకు ప్రపంచములో కూడ, పరలోకములో కూడ పుణ్యమును వ్రాయుము. నిశ్చయముగా మేము నీ వద్దకు (క్షమాపణ కోరుచు) వచ్చిన వారము.

(అల్ ఆరాఫ్:157)

దుఆలు కోరుచు: సేఠ్ ముహమ్మద్ బషీరుద్దీన్ జమాఅత్ మాజీ రాష్ట్రాధ్యక్షులు ఆం.ప్ర.
మరియు కుటుంబికులు: హైద్రాబాద్

ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None
మస్రూర్ హొటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ
అన్నికంపెనీల సెల్ రిచార్జ్‌లు చేయబడును.

(8 పేజి తరువాయి) అవకాశం కల్పించిరి, హ్జ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి బుజముపై తమ తలను పెట్టి ప్రదర్శన చూసిరి, ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నేను అలసిపోవునంత వరకు నా బరువును మోయుచుండిరి, ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇక చాలా ? అనిరి. (బుఖారి కితాబ్)

**క్షమాగుణము:-**

ఒక సారి హ్జ్రత్ ఆయిషా(రజి) ఇంట్లో ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తో వాడిగా, వేడిగా మాట్లాడుచుండిరి, పైనుండి వారి తండ్రి హ్జ్రత్ అబూబకర్ (రజి) వచ్చిరి, ఈ పరిస్థితిని చూచి వారు సహించక అల్లాహ్ ప్రవక్తతో ఈ విధముగా మాట్లాడుదువా ? అని తన కుమార్తెను కొట్టడానికి ఉపక్రమించెను, ఇది చూసి ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తండ్రి కూతుళ్ళ మధ్య వచ్చి హ్జ్రత్ అబూబకర్ (రజి) ఇచ్చు శిక్ష నుండి హ్జ్రత్ ఆయిషా (రజి) ను రక్షించుకొనిరి, హ్జ్రత్ అబూబకర్ (రజి) వెళ్ళిపోయిన తర్వాత హ్జ్రత్ ఆయిషా (రజి) తో ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈరోజు నిన్ను నీతండ్రితో మేమెట్లు రక్షించితిమో చూచితివా ? అనిరి, కొన్ని రోజుల తర్వాత హ్జ్రత్ అబూబకర్ (రజి) మరల వచ్చినప్పుడు ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో హ్జ్రత్ ఆయిషా (రజి) సంతోషముగా మాట్లాడుచుండిరి, అప్పుడు అబూబకర్ (రజి) మీరు తమ పోట్లాటలో నన్ను చేర్చినట్లు సంతోషముగా చేర్చుకొనుమనిరి. (అబు దావూద్)

**పురుషుల వ్యవహారములలో స్త్రీల జోక్యము:-**

హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం శ్రీమతి హ్జ్రత్ హఫ్స బిన్త్ ఉమర్ (రజి) కొంత వరకు వాడి వేడి స్వభావము కలిగి యుండిరి, ఒకసారి హ్జ్రత్ ఉమర్ (రజి) శ్రీమతి వారికి ఏదో సలహా ఇవ్వడానికి ప్రయత్నించెను, వారు పురుషుల వ్యవహారములో స్త్రీల జోక్యమునకు అర్ధమేమి ? అని కోపగించుకొనిరి, వారి(రజి) శ్రీమతి ఇట్లనిరి, నీ కుమార్తె హఫ్స అయితే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తో మాటలే గాక ఎదురించును, కొన్ని సమయాలలో రోజంతా వారితో రసూలుల్లాహ్ (స.అ.వ) అసంతృప్తిగా నుందురు, హ్జ్రత్ ఉమర్ (రజి) వెంటనే తన కుమార్తె ఇంటికి వెళ్ళి నీవు రసూలుల్లాహ్ (స.అ.వ) తో పోట్లాడడం వలన రోజంతా వారు అసంతృప్తితో నుందురా ? అని అడిగినప్పుడు హ్జ్రత్ హఫ్స (రజి) కొన్ని సార్లు ఇట్లగునని సమాదానమిచ్చిరి, అందుకు వారు ఆయిషా (రజి) అనుకరణలో ఏదో ఒకనాడు కష్టపడెదవని బోధించిరి, హ్జ్రత్ ఉమర్ (రజి) బంధువైన హుజూర్ (స.అ.వ) మరో శ్రీమతి ఉమ్మె సల్మ (రజి) ను కూడ ఉపదేశించుకుంటుపోయిరి, వారిట్లనిరి ఓ ఉమర్ ! నీవు రసూలుల్లాహ్ (స.అ.వ) గృహ విషయములలో కూడ జోక్యము కలిగించుకొందువా ? దీని కొరకు రసూలుల్లాహ్ (స.అ.వ) చాలరా ? నేను మౌనం వహించి తిరిగి వచ్చితినని హ్జ్రత్ ఉమర్ (రజి) అనిరి. ఈ వృత్తాంతమును ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కు వినిపించి నప్పుడు వారు (స.అ.వ) సంతుష్టులైరి. (బుఖారి)

**పుణ్యము కొరకు ఒకరినొకరు ప్రేరేపించుకొనుట:-**

ఆన్హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గృహములో సదా ప్రార్థన స్థిరత కొరకు శ్రద్ద యుండేది, వారిట్లనువారు. ఒకరినొకరు ప్రార్థన, ఆరాదన కొరకు నిద్ర నుండి మేల్కొలుపు భార్య బర్తలు చాలా అదృష్టవంతులు, ఒకరు మేల్కొననిచో మరొకరు నీరు చల్లి మేల్కొలుపుదురు. (ఇబ్నె మాజ) తమ కుటుంబ సభ్యులతో ఆన్ హ్జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వ్యవహారమిట్లుండును, హ్జ్రత్ ఆయిషా (రజి) ఇట్లు తెలిపిరి, రాత్రి తహజ్జుద్ ప్రార్ధన కొరకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మేల్కొనేవారు, ఫజర్ ప్రార్ధన కొరకు సమయముండగా నన్ను మేల్కొలిపి నీవు కూడ రెండు రకాతులు చదువమనేవారు, (బుఖారి)

## దుఆయె ఫాతిహా ద్వారా పరిపూర్ణ ఆధ్యాత్మికత

అల్లాహ్ తో ఆధ్యాత్మిక పరిపూర్ణ సంభంధమేర్పరచుటకు మూలాధారము ఇస్లాం, దుఆయె ఫాతిహా అని మనకు పవిత్ర ఖురాన్ బోధించును. అనగా ముందు తన జీవిత మంతయు అల్లాహ్ మార్గములో అంకితము చేయుట, తర్వాత ఫాతిహా అధ్యాయము ముస్లిములకు నేర్పిన, బోధించిన ప్రార్ధనలో నిమగ్నమగుట, ఇస్లాం సారాంశము. ఆసాంతము ఈ రెండు విషయములతో ముడిబడి యున్నది, ప్రపంచంలో అల్లాహ్ను చేరుటకు యధార్ధ విముక్తి కలిగించు నీరు త్రాగుటకు ఇస్లాం, దుఆయె ఫాతిహా ఉత్తమోత్తమ మార్గము. మానవ అత్యున్నత ప్రగతి అల్లాహ్తో కలిగి యుండుటకు సృష్టి శాసనము విధించిన మార్గము ఇదొక్కటే, ఇస్లాం భావపు ఆధ్యాత్మిక మంటలో ప్రవేశించి దుఆయె ఫాతిహాలో నిమగ్నమైన వారే అల్లాహ్ను పొందెదరు, ఇస్లాం అనగానేమి ? మన అధమమైన జీవితమును భస్మము చేసి మన అసత్య ఆరాధ్యాలను కాల్చి సత్యమైన, పవిత్రమైన ఆరాధ్యునికి మన ప్రాణము, మన ధనము, మన గౌరవ మర్యాదలనర్పించునదే ఇస్లాం. ఇట్టి చెలిమలో ప్రవేశించి మనము ఒక క్రొత్త జీవితపు నీరును త్రాగెదము. మన ఆధ్యాత్మిక శక్తులన్నియు అల్లాహ్తో బాంధ్యములు ఒకదానితోనొకటి సంభందమేర్పరచుకొనినట్లు అతికి పోవును, పిడుగు మంట వలె ఒక మంట మనసులో నుండి వెళ్ళును, ఒక మంట పైనుండి మనపై దిగును, ఈ రెండు జ్వాలల కలయికతో మన మొత్తము అత్యాశలు అల్లాహ్ తప్ప ఆరాధ్యుల ప్రేమ భస్మమగును, మనము మన మొదటి జీవితమును వదిలెదము, ఈ పరిస్థితి నామము పవిత్ర ఖురాన్ ప్రకారము ఇస్లాం అనబడును. ఇస్లాంతో మన కామవాంఛలకు మరణమావరించును, ప్రార్ధన వలన మనము మరల జీవింతుము. ఈ రెండవ జీవితము కొరకు అల్లాహ్ సువార్త చాలా అవసరము. ఈ అంతస్థునకు చేరుటను అల్లాహ్ కలయిక అందురు, అనగా అల్లాహ్ దర్శనమగును, ఈ దశలో చేరి మానవుడు అల్లాహ్ ను కనులతో చూచినట్లు అతనిలో లీనమగును, అతనికి శక్తినివ్వబడును, అతని సర్వేంద్రియములు సర్వ అంతర శక్తులు ప్రకాశింపజేయబడును, పవిత్ర జీవిత ఆకర్షణ బలముగా మొదలగును. ఈ దశను చేరినప్పుడే అల్లాహ్ మానవుని కనులగును దానితో అతడు చూచును, అతడు మాటలాడు నాలుక అగును. అతడు దాడి చేయు చేతులగును, అతడు విను చెవులగును, అతడు నడుచు పాదములగును, ఈ దశను సూచించుచు అల్లాహ్ ఇట్లనును **"యదుల్లాహి ఫౌక ఐదీహిం"** వారి చేతులపైనున్న అతని చేయి అల్లాహ్ చేయి.

ఇటులనే ఇట్లనెను **"వమా రమైత ఇజ్ రమైత వలాకిన్నల్లాహ రమా"** అనగా రువ్వినది నీవు కావు, అల్లాహ్ రువ్వెను. మొత్తముపై ఈ దశలో అల్లాహ్తో అద్భుత స్నేహము ఏర్పడును. అల్లాహ్ పవిత్ర సమ్మకము ఆత్మ నరనరాలలో వ్యాపించును. బలహీనముగా నుండి నైతిక శక్తులు పాతుకొనిన పర్వతముల వలే గోచరించును. తెలివితేటలు రమ్యముగా మారును. అల్లాహ్ నుడివడిన ఈ సూక్తి భావము ఇది. **"వ అయ్యదహుం బిరూహిమ్మిన్హు"** ఈ దశలో ప్రేమ కాలువలు పొంగుచు అల్లాహ్ కొరకు మరణించుట, అల్లాహ్ కొరకు వేల దు:ఖములను సహించుట, అగౌరవపాలగుట ఒక గడ్డిపోసను విరుచుటతో సమానమగును. అల్లాహ్ వైపు ఆకర్షింపబడి ఎవరు లాగుచున్నాడో ఎరుగడు. ఒక అదృశ్య చేయి అతనిని మోయుచు తిరుగును. అల్లాహ్ ఇష్టములను పూర్తిచేయుట అతని జీవితముఖ్యోద్దేశమగును. ఈ దశలో అల్లాహ్ చాలా సమీపములో గోచరించును. అతడు నుడివినట్లు **"వ నహ్ను అక్రబు ఇలైహి మిన్ జబలిల్ వరీద్"** అనగా అతనికి మేము అతని ప్రాణధమని కంటే సమీపములో నున్నాము. ఈ దశ లో ఈ స్థితిలో గల మానవుడు పక్వమై స్వయముగా వృక్షము నుండి పడిపోవు ఫలమువలె నుండును. ఈ విధముగానే ఈ స్థితి గల మానవుని అధమ సంబంధములు మాయమగును. అతని సంబంధము అల్లాహ్తో దృఢమై అతడు జనులతో దూరమై అల్లాహ్తో సంభాషించును, సంభోదింపబడును. ఈ స్థితిని పొందుటకు పూర్వము తెరువబడినట్లు ఇప్పుడు కూడ ద్వారములు తెరువబడి యున్నవి. ఇప్పుడు కూడ అల్లాహ్ అనుగ్రహము ఈ భాగ్యము అన్వేషించువారికి ముందిచ్చినట్లు ప్రసాదించును. కాని ఈ మార్గము కేవలము నోటి మాటలతో లభించదు, కేవలం బూటకములు, డంబములతో ఈ ద్వారము తెరుచుకోదు, కోరువారు అధికులున్నారు, కాని పొందు వారు అరుదు, దీనికి కారణమేమి ? ఈ దశ నిజమైన జిజ్ఞాస అన్వేషణ పైననే ఆధారపడియున్నది, మాటలు ప్రళయ దినము వరకు మాటలాడుము, కాని లాభమేమి ? ఈ మార్గపు మొదటి షరతు సత్యముతో ఈ మంటలో కాలిడుట, కాని జనులు భయపడుచు పలాయనమగుదురు, శ్రద్దతో కార్యసిద్ధి లేనిచో ఉత్త మాటలు పనికి రానివి, దీని గుర్చి అల్లాహ్ జల్లషానహు ఇట్లు బోధించెను **"వఇజా స అలక ఇబాదీ అన్నీ ఫఇన్నీ ఖరీబ్. ఉజీబు దావతద్దాఇ ఇజా దఆని ఫల్యస్తజీబులీ వల్ యూమినూబీ లఅల్లహుం యర్శుదూన్"** అనగా నాదాసులు నాగురించి అతడెక్కడున్నాడని ప్రశ్నించినచో వారితో ఇట్లనుము, అతడు మీకు చాలా సమీపములో నున్నాడు. నేను ప్రార్థించు వారి ప్రార్ధనలు వినెదను, కానుక వారు ప్రార్ధనల ద్వార నా కలయిక వెతక వలెను, కృతార్ధులగుటకు నన్ను విశ్వసించుము. (ఇస్లామి ఉసూల్ కి ఫిలాసఫి, పుట 394)

EDITOR
SYED RASOOL NIYAZ
SUB EDITOR: MOHAMMAD AKBAR
Mobile. :(+91) 9948692101
e-mail :badartel001@gmail.com
website:www.akhbarbadarqadian.in
:www.alislam.org

Title Code: PUNTEL00001
The Weekly BADAR Qadian
బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
Vol.1. Thursday 27 OCT 2016 Issue No.34

MANAGER
NAWAB AHMAD
Tel : (+91)-1872-224757
Mobile. : (+91) 94170-20616
e-mail :managerbadrqnd@gmail.com
ANNUAL SUBSCRIPTION:Rs.300/-

# ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం – పవిత్ర సతీమణులు

**హజ్రత్ ఖదీజ (ర.అ) సాక్ష్యము :–**

హజ్రత్ ఖదీజ (ర.అ) రసూలె కరీం (స.అ.వ) తో సుమారు పదిహేను సం॥ ల దీర్ఘకాలపు జీవనము కొనసాగించిన తర్వాత మొదటి సువార్తవాణి సమయమున హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్ ప్రవర్తనను గూర్చి ఇట్లు సాక్ష్యమిచ్చిరి, “ అల్లాహ్ తాలా మిమ్ములనెప్పుడు వృధా చేయడు, ఎందుకనగా మీరు సానుభూతి చూపింతురు, బంధుత్వమును కొనసాగించుదురు, (ఇతరుల) బరువులను మోయుదురు, కనుమరుగైన పుణ్యములను అమలు చేయుదురు, అతిథులను గౌరవింతురు, అవసరాలను తీర్చుదురు”. (బుఖారి కితాబ్)

**సతీమణులపై ఏనాడు చేయి చేసుకొన లేదు :–**

దాంపత్య జీవనమును గూర్చి హజ్రత్ ఆయిషా (రజి) సాక్ష్యమిట్లు గలదు, ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సర్వ జనుల కన్న దయార్ద్రహృదయము గలవారు, అందరికంటే దయాళువు, సాధారణ మానవులవలే నిరాడంబరముగా గృహములో నుండేవారు, ఏనాడు కోపగించక సదా చిరునవ్వుతో మెలిగేవారు, మరిట్లనిరి, వారు తమ జీవితములో ఏనాడు ఏ శ్రీమతిపై, ఏ సేవకునిపై గాని చేయి చేసుకొనలేదు, (షమాఇలే తిర్మిజి)

**గృహమునందు సహాయసహకారములందించువారు :–**

హజ్రత్ ఆయిషా (రజి) ఇట్లు తెలిపిరి, ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గృహములో నున్నంత వరకు ఇంటి వారికి సహాయసహకారము లందించేవారు, అజాన్ వినిన పిదప మస్జిద్‌నకు వెళ్ళేవారు, (బుఖారి)

**తమ పనులను స్వహస్తములతో చేసుకొనెడి వారు :–**

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గృహమునందు ఏమేమి చేసేవారని ఒకరు హజ్రత్ ఆయిషా (రజి) ను అడిగినప్పుడు వారిట్లు తెలిపిరి, ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గృహజీవనములో సాదారణ మానవులలో ఒకరిగా నుండేవారు, చిరిగిన దుస్తులను స్వయముగా కుట్టుకొనువారు, స్వయముగా మేక పాలు పితుకువారు, తమ పనులన్నియు స్వయముగా చేసుకొనెడి వారు. (మస్నద్ అహ్మద్) మరిట్లనిరి, ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ దుస్తులను స్వయముగా శుభ్రపరుచుకొనువారు, పాదరక్షలను కుట్టుకొనేవారు, బొక్కెన మొ॥ వాటిని స్వయముగా సవరించుకొనువారు (మస్నద్ అహ్మద్) రాత్రి ఆలస్యముగా ఇంటికి వచ్చినచో ఎవరికి శ్రమ కలిగించక స్వయముగా భోజనం చేసేవారు, పాలు త్రాగేవారు, ముస్లిం కితాబ్)

**సతీమణులను సంతోశ పెట్టుట:–**

హజ్రత్ ఆయిషా (రజి) ఇట్లు తెలిపిరి, ఒక ప్రయాణములో వారు(రజి) ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తో నుండిరి, ప్రయాణమునందు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఆయిషా (రజి) తో పరుగు పందెమాడెను, ఆ పందెములో హజ్రత్ ఆయిషా (రజి) ముందుండిరి, కాని మరోసారి వారు (రజి) బరువు పెరిగినప్పుడు పరుగు పందెమాడిరి, అప్పుడు ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందుండిరి, హుజూర్ (స.అ.వ) ఓ ఆయిషా ! గత పందెపు ప్రతీకారమిది అనిరి, (అబూ దావూద్)

**సతీమణుల పట్ల ప్రేమను కనబర్చుట:–**


హదీసులో ఇట్లు గలదు, ఒక నల్లజాతి స్త్రీ ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధమునుండి క్షేమముగా తిరిగి వచ్చినచో నేను హుజూర్ (స.అ.వ) ముందు డోలు కొట్టుచు పాడెదనని విన్నవించుకొనెను, హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం (యుద్ధము నుండి క్షేమముగా తిరిగి వచ్చిన పిదప) నుండి ఆమె అనుమతి పొంది పాడుట మొదలు పెట్టెను, ఆ సమయమయలో హజ్రత్ ఆయిషా (రజి) ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భుజముపై తలను ఉంచి ఆ సన్నివేశమును తిలకించుచుండిరి, ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఆయిషా (రజి) తో ఈ సన్నివేశముతో సంతృప్తి చెందితివా అని అడగగా లేదు అని ప్రతిసారి సమాధానమిచ్చిరి, కేవలం ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నాపై కనబర్చే ప్రేమను తెలుసుకొనుట కొరకే ప్రతీసారి నిరాకరించుచుంటిననిరి. (తిర్మిజీ కితాబ్)

**కథలు వినిపించుట:–**

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ సతీమణులకు కథలు కూడ వినిపించేవారు, ఒకమారు ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ భర్తల లోపాలను ఒకరితోనొకరు చెప్పుకొనిన పదముగ్గురు స్త్రీల కథ వినిపించెను, కథలో ఎల్లప్పుడు భర్తను పొగుడుకునె ఉమ్మె జర్అ అనబడే స్త్రీ కి కథ ప్రకారం ఆమె బర్త అబు జర్అ విడాకులిచ్చి మరో వివాహం చేసుకొనిన కథను హజ్రత్ ఆయిషా (రజి) కు వినిపించిరి. ఆయిషా (రజి) మరియు నా ఉదాహరణ అబు జర్అ మరియు ఉమ్మె జర్అ లాంటిదనిరి, అదియుగాక నీవు నాఉమ్మె జర్అ నేను నీ అబు జర్అ నని ఆయిషా (రజి)తో అనిరి, కాని వ్యత్యాసమేమనగాఉమ్మెజర్అ కు అబు జర్అ విడాకులిచ్చెను, కాని నేను నీకు విడాకుల్వీను. (బుఖారి కితాబున్నికాహ్)

**యుద్ధ నైపుణ్య ప్రదర్శన:–**

ఒక పండుగ సందర్భమున హబ్శ వాసులు మస్జిదె నబ్వీ విశాల ప్రాంగణంలో యుద్ధ చాతుర్యములను ప్రదర్శించుచుండిరి, ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఆయిషా (రజి) కోరిక మేరకు తమ వెనుక నిలబెట్టి వాటిని తిలకించుటకు ( 7 పేజిలో చదువగలరు)




Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of the Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz